రాజు—(కౌతుకముతో) మిత్రుఁడా! అది యేమి?

వసం—నీవదృష్టవంతుఁడవు. నీవే యిందు వ్రాయఁబడినావు. "నీవే కానియెడల మన్మథుఁ డనుమిష చేత మఱుఁగుపఱుపఁ దగినవా డన్యుఁ డెవ్వఁడున్నాఁడు?" అని నేనన్నది నిజమే.

రాజు—(హర్షముతో చేయి సాఁచి) సఖుఁడా! చూపుము చూపుము.

వసం—నీకు చూపను. ఆకన్యకయు నిక్కడ వ్రాయఁబడి యున్నది. ఏమియు పారితోషికము లేకుండ నిటువంటికన్యారత్నము నూరక చూపుదునా?

రాజు—ఇదిగో పుచ్చుకొమ్ము. (అని హస్తకటకము నిచ్చి బలాత్కారముగా పుచ్చుకొని చూచి విస్మయముతో) మిత్రుఁడా! చూడు.

గీ. చిత్రగతమైన యీసరసీరుహాక్షి
పక్షపాతంబు చూపుచు వారిజంబు
నందముగఁ గదల్చుచు రాజహంసివోలె
మానసం బలరించెడు మఱియు మఱియు.

గీ. వారిజభవుండు సుందరివదనమునెడు
నక్షతాఖండచంద్రుని నమరఁ జేసి
తనదుపీఠపద్మము ముకుళనము నొంద
దుస్థితుండయి యుండును ధ్రువము గాను.

(అంత సాగరికయు సుసంగతయు ప్రవేశించుచున్నారు.)

సాగ—సఖీ! సుసంగతా! ఇఁక శారిక మనకుదొరకదు. ఆకదళీగృహమునుండి చిత్రఫలకమునైన తెచ్చుకొని వేగిరము వత్తము.

సుసం—సఖీ! అలాగునఁ జేయుదము. (అని సమీపమునకు వెళ్ళుచున్నారు.)

వసం—ఓమిత్రుఁడా! ఎందుచేత నామె యువతనముఖగా వ్రాయఁబడినది ?

సుసం—(ఆలకించి) సఖీ! వసంతకుఁడు మాటాడు దానినిబట్టి రాజునునిక్కడ నేయుండియుండునని యూహించెదను. కదళీగృహము పొదలోపల దాఁగియుండి చూతము. (అని వినుచున్నారు.)

రాజు—మిత్రుఁడా! చూడుచూడు.

గీ. వారిభజవుండు సుందరివదనము నెడు
నద్భుతాఖండచంద్రుని నమరఁ జేసి
తనదుపీఠపద్మము ముకుళనము నొంద
దుస్థితుండయి యుండును ధ్రువముగాను.

(అని మరల పఠించు చున్నాఁడు.)

సుసం—సఖీ! నీవదృష్టవంతురాలవు. నీహృదయవల్లభుఁడు నిన్నే వర్ణించుచున్నాఁడు.

సాగ—(లజ్జతో) సఖీ!పరిహాసశీలురాలవయి నన్నేలచులుక చేసెదవు!

వసం—(రాజును కదిపి) ఓయీ! ఆమె యెందుచేత నవనత ముఖగా వ్రాయబఁడినదని యడుగుచున్నాను.

రాజు—మిత్రుఁడా! శారికయే సకలమును జెప్పినది.

సుసం—(నవ్వి) సఖీ! శారిక మేధావిత్వమును గనఁబఱిచినది.

వసం—నీనేత్రములను దనువు నున్నదా లేదా?

సాగ—(సాధ్వసముతో తనలో) అయ్యో! అతఁడేమి చెప్పునో

యెఱుఁగను. నేను సత్యముగా మరణజీవితముల మధ్యను వర్తించుచున్నదానను.

రాజు — నేత్రములను దనుపుచున్నదా యని యడుగవలెనా!

సీ. అధికకష్టమువిూఁద నక్కట నాదృష్టి
యూరుయుగంబును నొకటదాఁటి
తడవుగాఁగ నితంబతలమున భ్రమియించి
త్రివళీతరంగయుక్తిని గరంబు
విషమమైయుండెడు వెలఁదిమధ్యమునందుఁ
జలియింపక వసించి క్షణములోన
తుంగస్తనములకుఁ దొడరి మెల్లఁగఁ బ్రాఁకి
దగఁగొన్నగతి నందుఁ దడవు నిలిచి
జలకణమ్ములు చిమ్ముచుఁ జెలఁగుచున్న
కన్నుదోయిని నాదట క్షణమునుండి
కాంక్షమీఱఁగఁ జూచుచుఁ గరము నిపుడు
సుఖ మనుభవించు చున్నది సుమ్ము సఖుఁడ.

సాగ — (విని తనలో) హృదయమా! ప్రసన్నత పొందుము. ప్రసన్నత పొందుము. ఊఱడు మూఱడుము. నీ మనోరథ మిప్పుడీమెట్టెక్కినది.

సుసం — సఖి! విన్నావా!

సాగ — (నవ్వి) నీవే వినుము. నీవ్రాఁతయొక్క నేర్పేకదా వర్ణింపఁబడుచున్నది.

వసం — (పలకనుజూచి) ఓయి మిత్రుఁడా! ఈదృశకన్యయు నీలాగున నీప్రియసమాగమమును మన్నించుచున్నదే. అటువంటి

నీరూపముమీఁద నీ కనాదర మేల? ఇక్కడనే యామెచేత వ్రాయఁబడియున్న నీరూపము నేలచూడవు?

రాజు—(చూచి) మిత్రుఁడా! ఆమెచేత వ్రాయఁబడినందున సత్యముగా నాయందు నేను గౌరవ ముంచుకోవలసినదే. కాఁబట్టి నన్ను నేనేల చూచుకొందును? చూడు—

గీ. భామినీమణి కరతలస్పర్శమునను
నాదు నెమ్మేను చెమరించె నాఁగ దీని
వ్రాయునప్పుడు పడనట్టిపద్మగంధి
బాష్పజలశీకరకణాళి పరిఢవిల్లు.

వసం—(ప్రక్కను జూచి) ఇదె యామెయొక్క సరసకమలినీదళమృణాల విరచితశయ్య మదనావస్థను సూచించుచుఁ గనఁబడుచున్నది.

రాజు—మిత్రుఁడా! చక్కఁగాఁ గనిపెట్టితివి!

చ. ఘనఘనంబునుం గుచయుగంబును సోఁకుట నీవలావలన్
ఘనముగ వాడి, మధ్యఁ జిఱుగా నది యంటమి వాడిపోక, చెం
తను భుజయుగ్మ మిట్టటు గదల్చుట నల్గడఁ దూలిపోయి, తి
న్ననియరవిందపత్త్రశయనం బదె తెల్పెడుఁ గాంత తాపమున్.

ఉ. బాలికయొమ్మనం దమరుఁబడ్డ విశాలపుఁ బద్మినీదళం
బాలలితాంగి లోపలి యనంగదశన్ వెలినేయుచుండెనున్
జాలఁగఁ దాపమందినకుచద్వయయోగముచేతఁ గంది తీ
రై లలి నేరుపడ్డవలయంబులు తెల్పుచునున్న క్రైవడిన్.

వసం—(నాట్యముచేత మృణాళమును పుచ్చుకొని) ఓమిత్రుఁడా! ఇది యామె పీనస్తనములనుండియే జాఱిన మఱియొక కోమలమృణాళహారము. దీనిని చూడుము.

రాజు—(పుచ్చుకొని అొమ్మునఁ జేర్చుకొని యసూయతో) ఓజడస్వభావమా?

గీ. పడఁతికుచకుంభమధ్యంబువలన జాతి
యోమృణాళహారమ! యెండి యుడికె దేల?
యెడము నీలోనితంతువు కేసి లేని
స్తనయుగముమధ్య నీ కెట్లు సంఘటిల్లు.

సుసం—(తనలో) కటకటా! అధికానురాగముచేత మనసు చెదరినవాఁ డయి రాజు అసంబద్ధము లయిన మాటలను పలుకఁ బొచ్చినాఁడు! ఇఁకమీఁద నుపేక్ష సేయుట యుక్తము కాదు. కానిమ్ము. ఇట్లు చేసెదను. (ప్రకాశముగా) సఖీ! ఎందునిమిత్తము నీవిక్కడకు వచ్చితివో యావస్తువు నీముందఱనే యున్నది.

సాగ—(అసూయతో) నే నెందుకొఱకు వచ్చితిని? ఏవస్తువు నాముందున్నది?

సుసం—(నవ్వి) ఓసీ! అనుమానపడకుము. చిత్రఫలకముకొఱకు. అదిగో దానిని వెళ్ళి పుచ్చుకొమ్ము.

సాగ—(రోషముతో) ఇటువంటి నీమాటలు గ్రహించుటకు నేను నిపుణురాలను గాను. కనుక మఱియొకచోటికిఁ బోయెదను.

(అని వెళ్ళఁబోవుచున్నది.)

సుసం—ఓసి యసహనురాలా! ఇక్కడ నొకముహూర్తకాలము నిలువుము. ఇంతలో కదళీగృహమునుండి చిత్రఫలకమును పట్టుకొని మరల వచ్చెదను.

సాగ—సఖీ! ఆలాగునఁ జేయుము.

సుసం—(కదళీగృహమున కేసి నడుచుచున్నది.)

వసం—(సుసంగతను జూచి తొట్రుపాటుతో) మిత్రుఁడా! చిత్రఫలకమును కప్పివేయుము. అదిగో దేవిగారిపరిచారిక యైన సుసంగత వచ్చుచున్నది.

రాజు—(బట్టలో ఫలకమును దాఁచుచున్నాఁడు.)

సుసం—(దగ్గఱకు వెళ్ళి) దేవా! జయము మగుఁగాక!

రాజు—సుసంగతా! నీకు మేలగుఁగాక! ఇక్కడ కూర్చుండుము.

సుసం—(కూర్చున్నది.)

రాజు—మేమిక్కడ నున్నసంగతి నీకెట్లు తెలిసినది?

సుసం—(నవ్వి) ఇంతే కాదు. చిత్రఫలకముతోఁగూడనిప్పటి దేవరవారి సర్వవృత్తాంతమును నాకుఁ దెలిసినది. దేవిగారితో వెళ్ళి చెప్పెదను. (అని వెళ్ళఁబోవు చున్నది.)

వసం—(భయపడి రహస్యముగా) ఓమిత్రుఁడా! ఇది చెప్పినంతయుఁ జేయును. ఈగర్భదాసి వదరుఁబోతుగదా! దీనినిసంతోషపెట్టుము.

రాజు—నీవు యుక్తమయినదానిని చెప్పితివి. (సుసంగత చేయి పట్టుకొని) సుసంగతా! ఇది యంతయు నవ్వులాట సుమీ. అకారణముగా నీవు దేవిగారికి వ్యధ పుట్టింపఁదగదు. ఇదిగో బహుమానము. (అని లేచి యాభరణ మియ్యఁబోవుచున్నాఁడు.)

సుసం—రాజా! కర్ణాభరణ మక్కఱ లేదు. చాలును. దేవిగారియనుగ్రహమువలన నాకు కావలసినన్ని యున్నవి. ఇది నేనును నవ్వులాటలకే యున్నదానను. నాప్రియసఖి యైనసాగరిక తన్నీచిత్రపటమునం దేల వ్రాసితి నని కుపితురాలయి యున్నది. అక్కడకు దయచేసి యామెచేయి పట్టుకొని యామెనుప్రసన్నురాలిని జేయుము. నా కదియే గొప్పయనుగ్రహము.

రాజు—(తొందరపాటున లేచి) ఆమె యెక్కడ? చూపుము. చూపుము.

సుసం—ఆమె కదళీగృహములోపల నున్నది.

రాజు—(సంతోషముతో) మార్గము చూపుము.

సుసం—రాజా! ఇదె యిదె. (అందఱును కదళీగృహము వంక నడుచు చున్నారు.)

సాగ—(రాజును జూచి సంతోషముతోను సాహసముతోను వడఁకుతోను తనలో) ఈయనను జూచి యతిభయముచేత నడుగు దీసి యడుగు పెట్టుట కయినను అశక్తురాలనుగా నున్నాను. ఇప్పు డేమి చేయుదును?

వసం—మిత్రుఁడా! చిత్రఫలకమును నేను పట్టుకొనెదను. దానితో మరల నేదియైనను పనివచ్చును. (సాగరికను జూచి) ఇహిహీ! ఆశ్చర్యము! ఆశ్చర్యము! ఇటువంటికన్యారత్నముమానుష లోకమునందుఁ జూడఁబడదు. కనుని బ్రహ్మసహిత మీమెనునిర్మించి విస్మయము పొందియుండునని యూహించెదను.

రాజు—మిత్రుఁడా! నామనసునందునాలాగున నే తోఁచినది.

చ. ఇల లలనాలలామ యగునీమెను బ్రహ్మసృజించి యద్భుతం
బలర నిజేక్షణాళికి నిజాసనపద్మముకన్న విస్తృతిన్
గలుగఁగఁ జేసియుండును దగందలలూఁచియు నుండు నాల్గు మో
ములఁ దగ మేలుమేలనుచు మున్నొకసారిగఁ బల్కియుండెడున్.

సాగ—(అసూయతో సుసంగతను జూచి) సఖి! ఇటువంటి చిత్రపుఫలకనా తెచ్చితివి? (అని వెళ్ళఁబోవుచున్నది.)

రాజు—గీ. కోపమున దృష్టి వఱవెదు కొమ్మ! నీవు
కనదు రూక్షభావము ప్రేమకతన నదియు;

చనుము త్వరమాని, జాఱెడుచరణములను
నీదుగురునితంబము చాల ఖేదమందు.

సుసం—రాజా! ఈమె యతికోపశీలురాలు గనుక చేయి పట్టుకొని యీమెను ప్రసన్నురాలిని జేయుము.

రాజు—(సంతోషముతో) నీవు చెప్పినట్లు చేసెదను. (అని సాగరికను చేతితోఁ బట్టుకొని స్పర్శసుఖమునునటించు చున్నాఁడు.)

వసం—ఓయీ! నీవపూర్వశ్రీని పొందినాఁడవు.

రాజు—మిత్రుఁడా! సత్యము.

గీ. లక్ష్మియే యీలతాంగి తలంచి చూడ;
పారిజాతపల్లవము లీపాణియుగము,
కాకయుండిన స్వేదమన్ కైతవముగ
నిట్టు లమృతంబు గురియింప నెట్లు గలుగు?

సుసం—సఖీ! నీవు తిన్ననిదానవు కావు. ఇప్పు డీప్రకారముగా రాజుహస్తము పట్టుకొన్నను కోపము విడువకున్నావు.

సాగ—(భ్రూభంగముతో) సుసంగతా! ఇంకను నూరకుండకున్నావు.

రాజు—ప్రియురాలా! సాగరికా! సఖీజనముమీఁద నీప్రకారముగా కోపపడుట యుక్తము కాదు.

వసం—అమ్మా! ఆఁకలిగొన్న బ్రాహ్మణునివలె నేల కోపపడియెదవు?

సుసం—సఖీ! నీతో నేను మాటాడను లే.

రాజు—ఓసికోపనురాలా! సమానప్రపత్తి గలసఖులయం దిట్లుండుట యుక్తము కాదు.

వసం—మిత్రుఁడా! ఈమె దేవి యైన కేవల వాసవదత్త కదా!

రాజు—(చకితుఁడయి సాగరికహస్తము ను విడుచుచున్నాడు)

సాగ—(తొట్రుపాటుతో) సుసంగతా! ఇప్పుడేమి చేయుదును?

సుసం—సఖీ! ఈకదళికావీధికి వెళ్ళిపోవుదము.

(అని వెళ్ళుచున్నారు.)

రాజు—(పార్శ్వములఁజూచి విస్మయముతో) వాసవదత్తా దేవి యెక్కడ?

వసం—ఆమె యెక్కడనో నేనెఱుఁగను. అతిదీర్ఘరోషము చేత నీమె రెండవ వాసవదత్తయోయని నేను పలికితిని.

రాజు—ఓరిమూర్ఖుఁడా!

క. ప్రకటానురాగ సమధిక
సుకృతప్రాప్తయునయి తగుచుం గంఠముఁ బొం
దకలదురత్నావళివలె
నకటా పోఁగొట్టితీవు హస్తగతసతిన్.

[అప్పుడు వాసవదత్తయు కాంచనమాలయు ప్రవేశించుచున్నారు.]

వాస—ఓసీ కాంచనమాలా! భర్తగారిచే పెంచఁబడుచున్న నవమాలికయిక్కడి కెంతదూరమున నున్నది ?

కాంచ—ఈకదళీగృహమును దాఁటినతరువాతకనఁబడును.

వాస—అట్లయిన త్రోవ చూపుము.

కాంచ—అమ్మా! రమ్ము రమ్ము. (సమీపించు చున్నారు.)

రాజు—మిత్రుఁడా! ఇప్పుడు నాప్రియురాలెక్కడ కనఁబడును?

కాంచ—అమ్మా! సమీపమున భర్తగారు మాటాడుచున్నట్టున్నారు. ఆయన దేవిగారికొరకే నిరీక్షించుచున్నారుగనుక దగ్గఱకు వెళ్ళుము.

వాస—(దగ్గఱకు వెళ్ళి) ప్రాణనాయకా! జయ మగుఁగాక!

రాజు—(రహస్యముగా) మిత్రుఁడా! చిత్రఫలకమును దాఁచుము.

వసం—(పుచ్చుకొని చంకను పెట్టుకొనుచున్నాఁడు.)

వాస—దేవా! నవమాలిక పుష్పించినదా?

రాజు—దేవీ! మేము ముందుగా వచ్చినవారమయ్యును నీవు రాలేదని చూడలేదు. రమ్ము కలిసివెళ్ళి చూతము.

వాస—(చూచి) ప్రాణనాథా! నవమాలిక పుష్పించినదని దేవర ముఖవిలాసమువలననే తెలియుచున్నదిగనుక నేను రాను.

వసం—దేవీ! అట్లయిన నీవే మాకోడిపోతివి. (అని చేతులు సాచి ఆడఁగా చంకనుండిపడినపలకను జూచి విషాదమును నటించుచున్నాఁడు.)

రాజు—రహస్యముగా (వేలితోఁజూపి వసంతకునిముఖమును చూచుచున్నాఁడు.)

వసం—(రహస్యముగా) మిత్రుఁడా! కోపపడకు ఏమియుత్తరము చెప్పవలెనో నే నెఱుఁగుదును.

కాంచ—(పలకపుచ్చుకొని) దేవీ! ఈచిత్రఫలకమున నేమి వ్రాయఁబడినదో చూడుము.

వాస—(చూచి తనలో) ఇతఁడు నాప్రాణనాయకుఁడు; తరువాతిది సాగరిక. (రాజునుగూర్చి సరోషహాసముతో ప్రకాశముగా రాజా! ఇది యెవరిచేత వ్రాయఁబడినది?

రాజు—(వెఱఁగుపాటుతోఁడి చిఱునవ్వుతో రహస్యముగా) చెలికాఁడా! ఏమని చెప్పను?

వసం—(రహస్యముగా) ఓయీ! విచారింపకుము. నేనుత్తరము చెప్పెదను. (ప్రకాశముగా వాసవదత్తతో) అమ్మా! మఱియొకలాగున తలంపకుము. తన్ను తాను వ్రాయుట కష్టమని నేను పలుకఁగావిని నాప్రియమిత్రుఁడు దీనిని వ్రాసితన నేర్పును కనబఱిచెను.

రాజు—వసంతకుఁడు చెప్పినది నిజమే.

వాస—(ఫలకమును జూపి) ప్రాణనాథా! తమసమీపమున నెవ్వతెయో యొకతె వ్రాయఁబడి యున్నదే; అది యార్యుఁడయిన యీవసంతకుని నేర్పా యేమి?

రాజు—(వెఱఁగుపాటుతోఁడి నవ్వుతో) దేవీ! మఱియొక విధముగా శంకింపకుము. ఏదో యొకకన్యను నామనస్సుచిత నేకల్పించి యీవిధముగా వ్రాసినాఁడను. ఇది మున్నెప్పుడును చూచినది కాదు.

వసం—సత్యము. ఇటువంటి సుందరిని మేము పూర్వమెప్పుడును చూచి యుండలేదని యీయజ్ఞోపవీతముతోఁడ ప్రమాణము చేసెదను.

కాంచ—(రహస్యముగా) దేవీ! ఒకవేళ నిటువంటిది ఘుణాక్షరముగా పడియుండవచ్చును. కోపముతో పనిలేదు.

వాస—(రహస్యముగా) ఓసి ఋజుమార్గురాలా! ఈతని వంకరమాటలు నీవెఱుఁగవు. ఇతఁడు వసంతకుఁడుసుమా! (ప్రకాశముగా రాజునుగూర్చి) ప్రాణేశ్వరా! నాకీచిత్రపటమును జూచినతరువాత శిరోవేదనము కలుగుచున్నది. దేవర యిందు సుఖముగా నుందురుగాక! నేను వెళ్ళెదను.

(అని లేచి వెళ్ళఁబోవుచున్నది)

రాజు—(చీర చెఱఁగు పట్టుకొని) దేవీ!

చ. అతివ! ప్రసన్నురాల వగు మంచన నీ వలుగంగ లేదు ప్ర
స్తుత; మిఁక నట్టుచేయునన దోషము నొప్పినయట్ల యౌను; దు
ష్కృతమును జేయలే దనిన నెంతు నసత్యముగాఁగ నీమదిన్;
ద్రుతగతి నేనిఁ జెప్పుటకుఁ దోఁచకయున్నది నాకు నిర్వ్యథన్.

వాస—(వినయముతో చీరచెఱఁగు విడిపించుకొని) ప్రాణనాయకా! మఱియొకలాగున భావింపకుము. నిజముగానే నేను శిరోవేదనముచేత బాధపడుచున్నానుగనుక వెళ్లెదను. (అని వెళ్ళుచున్నది)

వసం—నీయదృష్టముచేత క్షేమమును పొందితివి. అకాల వర్షానుబంధమువలె వాసవదత్త వెళ్ళిపోయినది.

రాజు—ఓరిమూర్ఖా! సంతోషము చాలింపుము. వెళ్లునపుడు గూఢముగా నున్న దేవిగారికోపానుబంధమును నీవు కనిపెట్టలేదు.

శా. వంచెన్నై న్నపుణిచే శిరంబు వడి భ్రూభంగంబు గాన్పించినన్;
గాంచన్ భేదపుఁ బ్రూష్వోపను పల్కన్ లేదు పారుష్యముల్;
మించ న్బాష్పములూరఁ జొచ్చినఁ గను ల్విప్పంగ లే దొప్పగన్;
గొంచెంబు న్సతి కూర్మి వీడదుసుమీ కోపంబు వెల్వార్చినన్.

వసం—వాసవదత్తాదేవి వెళ్ళిపోయినదిగనుక నీవిప్పుడు వట్టియరణ్యరోదనము చేయుచున్నావు.

రాజు—మూఢుఁడా! దేవిగారికోపమును నీవు కనిపెట్టలేవు. సర్వవిధములచేతను దేవిగారిని శాంతిపఱుచుటతప్ప మఱియొకయుపాయమును వెదకను. దేవిని ప్రసన్నురాలిని జేయుటకయియంతఃపురమునకు వెళ్లుదము రమ్ము.

(అని నిష్క్రమించుచున్నారు.)

తృతీయాంకము.

ప్రదేశము — రాచనగరు.

[మదనిక ప్రవేశించుచున్నది.]

మద—(ఆకాశమునందు) కౌశాంబికా! రాజుగారిసమ్ముఖమున నీవు కాంచనమాలను చూచినావా లేదా? (చెవి యిచ్చి యాలకించి) ఏమి చెప్పుచున్నావు? కొంతసేపటిక్రింద వచ్చి మరల వెళ్ళిపోయినదా? ఇప్పుడామె యెక్కడ కనఁబడును? (ముందువంకఁ జూచి) ఏమీ! కాంచనమాల యీవంకనే వచ్చుచున్నది. కావున నామెసమీపమునకు వెళ్లెదను.

[అంతట కాంచనమాల ప్రవేశించుచున్నది]

కాంచ—(నిట్టూర్పుతో) సాధు! వసంతకా! సాధు! ఇప్పుడు సంధివిగ్రహాలోచనచేత నీవు మంత్రి యైనయౌగంధరాయణుని మించినవాఁడ వయితివి!

మద—(చిఱునవ్వుతో దగ్గఱకువచ్చి) సఖీ! కాంచనమాలా! నీవింతగా శ్లాఘించుటకయి వసంతకుఁ డిప్పు డేమి చేసియున్నాఁడు?

కాంచ—సఖీ! మదనికా! నీయీప్రశ్నవలన నేమి ప్రయోజనము? నీవు రహస్యమును దాఁచజాలవు.

మద—ఇది యెవరిముందును వెల్లడిచేయనని దేవిగారి పాదములతోడ ప్రమాణము చేసెదను.

కాంచ—అట్లయినఁ జెప్పెదవినుము. నేనిప్పుడు రాజ మందిరమునుండి తిరిగి వచ్చుచుచిత్రశాలయొక్క ద్వారమున వసంతకుఁడు సుసంగతతో మాటాడుచుండఁగా విన్నదానను.

మద—(కౌతకముతో) సఖీ! ఆప్రసంగ మెటువంటిదో చెప్పుము.

కాంచ—వసంతకుఁ డీలాగునఁ జెప్పినాఁడు—"సుసంగతా! నాప్రియమిత్రుసియొక్కయస్వస్థతకుఁ గారణము సాగరిక తప్ప మఱి యేదియు లేదు. కాఁబట్టి యిక్కడ ప్రతీకారము నాలోచింపుము.

మద—అప్పుడు సుసంగత యేమన్నది?

కాంచ—అప్పు డామె యిట్లు చెప్పినది.—"చిత్రఫలక వృత్తాంతముచేత శంకితురాలయి సాగరికను పరిరక్షింపవలయు నని నా కొప్పగించి దేవిగారు తమవస్త్రములను భూషణములను నాకు దయచేసినారు. అందుచేత సాగరికకు దేవిగారివేషము వేసి వెంటఁ బెట్టుకొని నేనును కాంచనమాలవేషమును ధరించి ప్రదోషసమయ మునకు రాజుగారిసమీపమునకు వచ్చెదను. నీవును నిక్కడ నేయుండి చిత్రశాలద్వారమువద్ద కాచుకొని యుండుము; అప్పుడు మాధవీ లతామండపమునందు రాజున కామెతోడిసంగమము కాఁగలదు."

మద—సఖీ! సుసంగతా! పరిజనవత్సలురా లయినదేవిగారి నీవిధముగా వంచించు చున్నావు గనుక నీవు చెడిపోతివి.

కాంచ—సఖీ! మదనికా! నీ విప్పు డెక్కడకు వెళ్ళు చున్నావు?

మద—అస్వస్థశరీరుఁ డయినరాజుగారిశరీరవార్తను దెలిసి కొనుట కయి వెళ్ళి నీ వాలస్యము చేసితివని తొందరపడుచు దేవి గారు నీయొద్దకు నన్నుఁ బంపినారు.

కాంచ—ఆమె యతిబుజువర్తనము కలది. దేవి యిప్పు డిది యంతయు నమ్ముచున్నది. (కొంచెము నడచి చూచి) సఖీ! చూడు చూడు. అదిగో రాజుగా రస్వస్థతామిషచేత మన్మథావస్థను మఱుఁ

గుపఱుచుచు దంతతోరణావలభిమీఁదఁ గూరుచుండి యున్నారు. కాఁబట్టి యీ వృత్తాంతమును రాణిగారితో వెళ్ళి చెప్పుదము రా.

(అని నిష్క్రమించుచున్నారు.)

[అప్పుడు మదనావస్థను గనఁబఱుచుచుఁ గూరుచున్న రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు—(సోత్కంఠముగా నిట్టూర్పు విడిచి)

చ. హృదయమ! సైచుకొమ్మి యిపుడీవు స్మరాగ్నికృతాతితాపమున్
మది నరయంగ లేదుపశమంబిఁకఁ జింతిలఁబోకు మెట్టులో
యొదవిన సాంద్రచందనరసోపమమౌ సతిహస్త మప్పుడే
ముదమున నీపయిం దడవు పూన్పక మూఢుఁడ నైతి నక్కటా!

ఆహా! మిక్కిలి యాశ్చర్యము. అట్లేకదా!

గీ. ప్రకృతిచేతనె చంచలం బకట మనసు
మఱియు దుర్లక్ష్య మట్లయ్యుఁ దఱచి చూడ
మన్మనం బొక్కటను సర్వమార్గణములఁ
గుసుమశరుచేత నేరీతిఁ గొట్టఁబడెడు!

(పయివంకఁ జూచి) ఓ కుసుమధన్వుఁడా!

చ. అరయఁగ నీకుఁ దూపు లయిదంచును వానికి లక్ష్యభూతు లి
ద్దర మము బోం ట్లసంఖ్యులని దర్పక! వింతుము మందు, నీయెడఁ
గరము విరుద్ధమయ్యె నది, కామిజనుండగు నేనె పంచతం
బొరయుచునుంటి, నీవయినము లక్కలసంఖ్యములౌ మ నాఁటెడుఁ

(ఆలోచించి) లోపల నిగూఢమయిన కోపముగల దేవిగారికి లోచన గోచర యయి దీనురాలయియున్న యీసాగరికను గూర్చి నేను చింతిల్లుచున్నట్లుగా నిటువంటి యవస్థను బూనియున్న నన్నుఁగూర్చి నేను జింతిల్లను. అట్లేకదా!

ఉ. విక్కట! యందఱుం దెలిసి రంచు శిరంబును వంచు సిగ్గుచే,
నెక్కడ నిద్దఱేనునిన నెంచుకొనుం దనమాటగాఁగ, నా
చక్కని నెచ్చెలుల్ స్మితము సల్పిన నివ్వెఱఁగొందుఁ బేలమై
యక్కమలాయతాక్షి హృదయంబునఁగల్గు భయంబు పెంపునన్

ఆమెసంగతిని కనుఁగొనివచ్చుటకయినాచేతఁబంపఁబడిన వసంతకుఁ డెందుచేతనో యాలస్యము చేయుచున్నాఁడు.

[అప్పుడు హృష్టుఁ డగు వసంతకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వసం—(సంతోషముతో) ఆశ్చర్య మాశ్చర్యము! నేనిప్పుడు వెళ్ళి చెప్పెడి ప్రియవచనము వినుటచేతఁ గలిగెడునంత సంతోషము కౌశాంబీరాజ్యలాభముచేత సహితము నా ప్రియసఖునియొక్క హృదయమునకుఁ గలిగియుండదని నేనూహించెదను. కాఁబట్టి దగ్గఱకుఁబోయి ప్రియమిత్రున కంతయును వేదించెదను. (వెళ్లిచూచి) ఏమీ! నాప్రియమిత్రుఁ డీ దిక్కుననే చూచుచు కూరుచున్నాఁడు. కాఁబట్టి నా రాకకే ప్రతీక్షించుచున్నాఁ డని తలఁచెదను. సమీపమునకు వెళ్ళి కనఁబడెదను. (అని చెంతఁజేరి ప్రియమిత్రుఁడా! జయమగుఁ గాక! జయమగుఁ గాక! మిత్రుఁడా! నీ వదృష్టవంతుఁడ వభీష్టసిద్ధి యయినది.

రాజు—(హర్షముతో) మిత్రుఁడా! ప్రియురా లయిన సాగరికకు కుశలమా?

వసం—(గర్వముతో) మిత్రుఁడా! శీఘ్రముగా నీవే చూచి తెలిసికోఁ గలవు.

రాజు—(సంతోషముతో) మిత్రుఁడా! ప్రియురాలిదర్శనము కూడ లభించునా?

వసం—(గర్వముతో) బుద్ధివిభవమున బృహస్పతి నపహాసించెదు నేను నీకు మంత్రినయి యుండఁగా నేల లభింపకుండును?

రాజు—(నవ్వి) ఇందు చిత్ర మేమియులేదు. నీకు సాధ్యముకాని దేమున్నది? అయినను నాకు వినవలెనని నని యున్నది గనుక సవిస్తరముగాఁ జెప్పుము.

వసం—(చెవిలో నేమో చెప్పుచున్నాఁడు.)

రాజు—(సంతోషముతో) మిత్రుఁడా! ఇదిగో నీకు పారితోషికము. (అని చేతినుండి తీసి కడియము నిచ్చుచున్నాఁడు.)

వసం—(కడియముధరించి తన్నుఁజూచుకొని సంతోషముతో) ఇది బాగున్నది. ఈశుద్ధసువర్ణకటకముచేత ప్రకాశించుచున్న హస్తమును నాభార్యకు పోయి చూపి వచ్చెదను.

రాజు—(చేయి పట్టుకొని వారించుచు) సఖుఁడా! తరువాత చూపవచ్చును. ఇప్పుడు ప్రొద్దెంతయున్నదో చూడుము.

వసం—(కొంచెము నడచి చూచి సంతోషముతో) ఓహో! చూడుచూడు. అదిగో భగవానుఁ డయిన సూర్యుఁ డధికానురాగతీ ప్తహృదయుఁ డయి సంధ్యావధువుచే నిర్ణయింపఁబడిన సంకేతస్థలమునకు వెళ్ళునట్టుగా అస్త్రాద్రి శిఖరారణ్యమునుగూర్చి పోవుచున్నాఁడు.

రాజు—(చూచి హర్షముతో) మిత్రుఁడా! చక్కఁగాఁ జూచితివి. సంధ్యాకాల మైనది. అట్లేకదా?

ఉ. చక్రి మొకండు గల్గు రథసంగతి నెట్లు జగంబునెల్ల ని
ర్వక్రతఁ జుట్టి రేపకడఁ గ్రమ్మఱ రాఁగలనంచు నప్డు ది
క్చక్రమునందుఁ గూర్చెదునొ సంధ్యను నిల్చినయంశుజాల మన్
వక్రిత లేనియాకులన భానుఁడు పొల్చెడుఁ బశ్చిమాద్రిపైన్.

మఱియును,

గీ. ఓ జలరుహాస్య! నేఁ జనుచున్న వాఁడఁ
దిరిగి నే రేపు వచ్చి నిద్రించు నిన్ను
మేలుకొల్పెద నంచుఁ బద్మినిని నమ్మఁ
బలుకువిధమున నస్త్రాద్రి భానుఁ డలరు.

కాఁబట్టి లెమ్ము; ఆమాధవీలతామండపమునకు వెళ్ళి ప్రియురాలి సంకేతసమయమును నిరీక్షింపుచుందము.

వసం—మంచిమాట సెలవిచ్చినారు. (అని లేచి చూచి) ఓమిత్రుఁడా! చూడు చూడు అదిగో పలచగానున్న చెట్లసమూహమును దట్టముగాఁ జేయుచు, బురదలో పొరలిన వరాహముల యొక్కయు మహిషములయొక్కయు నల్లనిరంగుగలిగి తూర్పుదిక్కంతను గ్రమ్మి చీఁకటిగుంపు వ్యాపించుచున్నది.

రాజు—(సంతోషముతో సంతటను గలయఁ జూచి)

చ. శివునిగళచ్ఛవిం దెగడుచీఁకటి తొల్తను దూర్పుదిక్కునం
గవిసెను; మీఁద నంతటను గ్రమ్మి నగంబు కుజంబు గ్రామమన్
భువిఁగలభేదముల్ చెఱిచెఁ బూర్ణముగాఁ; దరువాతఁ జాలఁ దా
నవిరళమై జనంబులకు నతులు గల్గుఫలంబు వాపెడున్.

కాఁబట్టి మార్గమును జూపుము.

వసం—ప్రియమిత్రుఁడా! రమ్మురమ్ము. (అని నడుచుచు చూచి) ఇదిగో విస్తారముగా వృక్షము లుండుటచేత గాఢాంధకార పుంజమువలె నున్నమకరందోద్యానమును సమీపించినాము; ఇఁక నిక్కడ మార్గ మెట్లు కనఁబడును?

రాజు—(వాసనచూచి) మిత్రుఁడా! ముందునడువు; ఇక్కడ మార్గము తెలియుచునే యున్నది. ఎట్లందువేని—

మ. ఇది సంపంగులపంక్తి; యీవలివనంబే సిందువారాళి; యి
య్యది చూడన్ వకుళావనీజములగుంపౌఁ; బాటలశ్రేణి యి
య్యదియే యంచును దావిచేఁ దెలిసె నాహా దారి స్పష్టంబుగా
నిదె వృక్షంబులచేతఁ జీఁకటికడున్ హెచ్చయ్యెఁబూర్వస్తృతిన్.

(అని వెళ్ళుచున్నారు)

వసం—ఓ మిత్రుఁడా! మత్తిల్లినతుమ్మెదలు వ్రాలుచుండఁగా పొగడపువ్వులపరిమళము దిక్కుల నంతటను గొట్టుచున్నది; నున్నని మరకతమణులతోఁ గట్టఁబడిన నేల పాదసంచారమునకు మెత్తగాఁ దగిలి సుఖము నిచ్చుచున్నది; ఇదే మాధవీలతామండపము మనము వచ్చిచేరినారము. నేను వెళ్ళి దేవీవేషధారిణి యైనసాగరికను వెంటఁబెట్టుకొని వేగిరము వచ్చెదను. అంతవఱకును దేవరవారిక్కడనే యుండవలెను.

రాజు—మిత్రుఁడా! వెళ్ళి సత్వరముగా నిక్కడకు రమ్ము.

వసం—మిత్రుఁడా! తొందర పడఁబోకుము.

(అని వెళ్ళుచున్నాఁడు)

రాజు—నేనంతవఱకును ఈమరకతశిలావేదికయందుఁ గూరుచుండి, ప్రియురాలి సంకేతసమయమును ప్రతీక్షించుచుండెదను. (కూరుచుండి చింతతో) ఓహో! స్వభార్యాసమాగమము సేవగించు కాముకునకు నూతనప్రియురాలివిషయమయినపక్షపాతము నేమనను!

శా. సంకేతస్థలిఁ జేరుకాంత ప్రియునాస్యంబు న్విలోకింపఁగా
శంకించున్, మొడ కౌఁగిలించుతఱి వక్షంబంటఁ జన్దోయియున్
బింకంబారఁగఁ గ్రుమ్మనోడు; పతి దానిల్పంగఁ బల్మాఱునున్
జంకుం బాటునఁ బోవఁజూచు; నయినన్ సంతోషమెచ్చయ్యెడిన్.

అయ్యో! వసంతకుం డేల యాలస్యము చేయుచున్నాఁడు? ఈవృత్తాంతము దేవి యయినవాసవదత్తకు తెలిసిన దేమో!

[అప్పుడు వాసవదత్తయు, కాంచనమాలయు ప్రవేశించుచున్నారు]

వాస—ఓ కాంచనమాలా! సాగరిక నావేషమును ధరించి నిజముగా నే రాజుగారిదగ్గరకు వెళ్ళునా?

కాంచ—నిజము గాకపోయిన నేను దేవిగారితో విన్నవింతునా? చిత్రశాలాద్వారమున నుండువసంతకుఁ డయినను నీకు నమ్మకము పుట్టించును.

వాస—అట్లయిన నక్కడకే వెళ్ళుదము.

కాంచ—దేవీ! రండి రండి. (అని వెళ్ళుచున్నారు)

[అప్పుడు ముసుఁగు వేసికొని వసంతకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

వసం—(చెవి యిచ్చి) చిత్రశాలద్వారమున పాదముల చప్పుడు వినఁబడుచున్నది; సాగరిక వచ్చిన దనుకొనియెదను.

కాంచ—దేవీ! చిత్రశాల యిదే కనుక, ఇక్కడనే యుందుము. నేను వసంతకునకు సంజ్ఞ చేసెదను.

(అని చిటికె వేయుచున్నది)

వసం—(కాంచనమాలను చూచి సంతోషముతో దగ్గఱకు వచ్చి చిఱునవ్వు నవ్వి) సుసంగతా! నీవు వేసిన కాంచనమాల వేషము సరిగా నున్నది. ఇప్పుడు సాగరిక యెక్కడ నున్నది?

కాంచ—ఇదిగో. (అని వ్రేలితో చూపుచున్నది)

వసం—(చూచి యద్భుతపడి) ఈమె నిశ్చయముగా దేవి యయిన వాసవదత్తయే.

వాస—(సంశయపడి తనలో) నన్నితఁ డెట్లు ఆనవాలుపట్టి నాఁడు? నేను వెళ్ళెదను. (అని వెళ్ళఁబోవుచున్నది)

వసం—అమ్మా! సాగరికా! రా.

వాస—(నవ్వి కాంచనమాలవంక చూచుచున్నది)

కాంచ—(రహస్యముగా విదూషకుని బెదరించుచున్నది) ఓరిచెడుగా! ఈమాట మఱచిపోకుము.

వసం—సాగరికా! త్వరతో రమ్ము. త్వరతో రమ్ము. అడుగో చంద్రుఁడు తూర్పుదిక్కున నుదయింపఁబోవుచున్నాఁడు.

వాస—(తొట్రుపాటుతో రహస్యముగా) ఓచంద్రుఁడా! నీకు నమస్కారము. ముహూర్తముసేపు నీరూపము కనఁబడకుండ నుండుము. ఆయన భావానుబంధమును కనిపెట్టెదను.

(అందఱును నడుచుచున్నారు)

రాజు—(చింతతో తనలో) ప్రియురాలిసమాగమముసమీపించుచున్నప్పటికిని, నామన సెందుచేతనో మిక్కిలి మండుచున్నది.

గీ. తనకుఁ బ్రియురాలొదవనున్న తఱిని బోలె
స్మరుని తాపంబు మొదట దుస్సముగాదు
కాఁక తొంటికంటెను హెచ్చు గాంచుగాఁదె
వర్షపాత మాసన్నమౌ వాసరమున?

వసం—(ఆలకించి) ఓసాగరికా! అడుగో నాప్రియమిత్రుఁడు నిన్నుద్దేశించియే వేడుకతో మాటాడుచున్నాఁడు. ఇక్కడనుండుము. నీరాకను నేను నివేదించెదను.

వాస—(తల యూఁచుచున్నది)

వసం—(రాజుదగ్గఱకు వెళ్ళి) ఓమిత్రుఁడా! నీవదృష్టవంతుఁడవు. నేను సాగరికను తీసికొని వచ్చినాఁడను.

రాజు—(సంతోషముతోఁ దొందరపడిలేచి) ఆమెయెక్కడ? ఆమె యెక్కడ?

వసం—(భ్రూభంగముతో) అదిగో!

రాజు—(సమీపించి) ప్రియురాలా! సాగరికా!

చ. వదనము చందురుండు; కలువల్నయనంబులు; పాణు లబ్జముల్;
కదళిక లూరువుల్; భుజయుగంబును దామరతూండ్లు నీకు నో
సుదతిరో! కౌఁగిలం జొనిపి సూనశరాగ్నిని గాలియున్న నా
ప్రిదిలినయంగకంబులను బ్రేమను జల్లపడంగఁ జేయుమా.

వాస—(కన్నీటితో రహస్యముగా) కాంచనమాలా! ఇటువంటి యీయన యిఁకముందు మరల నాతో నెట్లు మాటాడఁగలఁడాయని నే ననుకొనియెదను. ఆహా! ఏమి యాశ్చర్యము!

కాంచ—(రహస్యముగా) దేవీ! అవునది నిజమే. సాహసికులయిన పురుషులకు మరల నేమిచేయుటకు దుష్కరము కాదు.

వసం—అమ్మా! సాగరికా! ధైర్యము తెచ్చుకొని ప్రియమిత్రునితో నేల మాటాడవు? ఇప్పుడయినను దేవియైన వాసవదత్త సదా కోపముతో పలుకుచుండు దుర్వచనములచేత కటువులయిన చెవులకు నీమధురవచనోపన్యాసముచేత సుఖము కలుగఁ జేయుము.

వాస—(రోషముతోడి చిఱునవ్వు నవ్వి రహస్యముగా) ఓసీ! కాంచనమాలా! నేనెప్పుడును కటుభాషిణినఁట! పూజ్యుఁడయిన యీవసంతకుఁడు తా నేమో మహాప్రియంవదుఁ డఁట!

కాంచ—(రహస్యముగా వేలితో బెదరించుచు) ఓరి చెడుగా! ఈమాట తరువాత నీవు తలఁచుకొనియెదవు.

వసం—(చూచి) ఓమిత్రుఁడా! చూడుము చూడుము, కుపి

తురా లయిన కామినియొక్క చెక్కిలివలెనే తూర్పుదిక్కును ప్రకాశింపఁ జేయుచు చంద్రుఁ డుదయించుచున్నాఁడు.

రాజు—(చూచి యాశతో) ప్రియురాలా! చూడుచూడు.

గీ. నీముఖవదనాపహ్నాతకాంతినిచయుఁ డగుచుఁ
దా ప్రతిక్రియ చేయంగఁ దలఁచినట్టు
లెదుటఁ గాన్పించుచున్నవాఁ డుదయగిరిని
గరములను జాఁచి యల్లదె కమలవైరి.

ప్రియురాలా! ఈయన పయినుదయించుట జడత్వమేసుమా. ఎట్లనమ. హరియింపఁగను లేదె తమ్మిసిరి? నేత్రానందముం గూర్పదే? స్మరతాపంబును బెంపదే మిగుల వీక్షామాత్ర? నీమోము చంద్రుఁ డుండ న్మఱిచంద్రుఁడేటికి దివిం దోఁచుట? విధుండాసుధాకరతన్ గర్వము నొంద నద్ది కలుగుంగా నీదుకెమ్మోవిలోన.

వాస—(రోషముతో) మేలిముసుఁగుతీసి వేసి) ఓరాజా! నేను సత్యముగానే సాగరికను. నీవు సాగరికచే నాకర్షింపఁబడిన మనస్సు గలవాఁడవయి సర్వమును సాగరికామయముగాఁ జూచుచున్నావు.

రాజు—(చూచి యద్భుతపడి రహస్యముగా) హా! ఇది యేమి! ఓరిదుష్టా! దేవి యైనవాసవదత్తనే తీసికొని వచ్చినావు!

వసం—(విషాదముతో) మిత్రుఁడా! మఱి యేమున్నది? నాకిప్పుడు జీవితసంశయము సంభవించినది.

రాజు—(చేతులు జోడించి) ప్రియురాలా! వాసవదత్తా! రక్షించు.

వాస—(అయనవంకఁ దిరిగి కన్నీరు విడుచుచు) దేవా! ఇతరులసొమ్మయిపోయిన యామాటనిప్పుడు నావిషయమున నుపయోగించకుము.

వసం—(తనలో) నేనిప్పు డేమి చేయుదును? కానిమ్ము. ఈప్రకారముగఁ జేసెదను. (ప్రకాశముగా) అమ్మా! నీవు మహానుభావురాలవు. నా ప్రియమిత్రునియొక్క యీ యొక్కయపరాధమును క్షమింపుము.

వాస—అయ్యా! వసంతకా! ఈయపరాధము ప్రథమసంగమమునందే విఘ్నము కలుగఁజేసిన నాదే కాని రాజుగారిది కాదు.

రాజు—ఈవిధమున నేరము ప్రత్యక్షముగా కనఁబడుచుండఁగా నేనేమి చెప్పుదును? అయిన నొక్క విజ్ఞాపనము చేసికొనెదను.

చ. లలనరో! నీదుపాదముల లత్తుకచే నయినట్టి రక్తిమన్
దొలఁచఁగనోపుదున్ శిరసుతోడను నే నిట; నీముఖేందుమం
డలమున రోషరాహుగ్రహణంబునఁ గల్గినయట్టి తామ్రతన్
జెలువరో! నీదయామహిమచేతను గాక యడంపనేర్తునే?

(అని పాదములమీఁద పడుచున్నాఁడు.)

వాస—(చేతితో లేవఁదీయుచు) ప్రాణేశ్వరా! లెమ్ము లెమ్ము నేను సిగ్గుమాలినదానను. దేవరవారిహృదయమిటువంటిదని యెఱిఁగి యుండియు మరల కోపము వహించుచున్నాను. దేవరవారు సుఖముగా నుందురుగాక! నేను వెళ్లెదను. (అని వెళ్లఁబోవుచున్నది.)

కాంచ—దేవీ! అనుగ్రహింపుము. ఈప్రకారముగా కాళ్ళమీఁద పడినమహారాజును విడిచి వెళ్ళినతరువాత నీవే పశ్చాత్తాప పడెదవు.

వాస—పో మూర్ఖురాలా! ఇక్కడ పశ్చాత్తాపమునకు కారణమేమున్నది? వెళ్ళుదము. రా. (అని వెళ్లుచున్నది.)

రాజు—దేవీ! క్షమించు క్షమించు. (“లలనరో నీదు పాదముల” అనుపద్యము మరలఁ జదువుచున్నాఁడు.)

వసం—మిత్రుఁడా! లెమ్ము. వాసవదత్తాదేవి వెళ్ళిపోయినది. ఇఁక నిక్కడ నరణ్యరోదన మేల చేసెదవు?

రాజు—(ముఖమెత్తి) నాయం దనుగ్రహము చూపకయే దేవి వెళ్ళిపోయినదా?

వసం—అనుగ్రహము చూపకపోవుట యెట్లు? మనమిప్పుడు శరీరమున గాయములు లేకుండ నున్నాము.

రాజు—ఛీ! మూర్ఖుడా! నీవేల నన్నేల పరిహసించుచున్నావు? నీమూలముననే నిష్కారణముగా నా కీయనర్థము సంభవించినది.

ఉ. అంతకు నంతకుం బెరుగు నర్మిలిజేతను బ్రేమ హెచ్చె; ని
ట్లింతకుమున్ను నేను దన కెన్నఁడుఁ జేయనియప్రియంబుచే
నింతయుఁ దాళలేక త్యజియించును వాసవదత్తప్రాణముల్
వింతగఁ బ్రేమ హెచ్చిన భువిం జిఱుతప్పును దుస్సహంబగుఁ౯.

వసం—చెలికాఁడా! దేవి మిక్కిలి కుపితురాలయి యున్నది. అందుచేత నామె యేమిచేయునో తెలియదు. ఇఁక సాగరిక జీవించుట దుష్కర మని నేననుకొనియెదను.

రాజు—మిత్రుఁడా! నేనును అలాగున నేయనుకొనుచున్నాను. అయ్యో! సాగరికా! నాప్రియురాలా!

[అప్పుడు వాసవదత్తావేషధారిణి యైనసాగరిక ప్రవేశించు చున్నది.]

సాగ—(భయముతో) ఈ దేవీవేషముతోనదృష్టవశముచేత నెవ్వరికిని గనఁబడకుండ సంగీతశాలను దాఁటి వచ్చితిని. ఇఁక నిప్పు డిక్కడ నేమి చేయుదును? (అని కన్నీటితో చింతిల్లుచున్నది.)

వసం—మిత్రుఁడా! మూర్ఖునివలె నూరకున్నా వేమి? ఇక్కడ ప్రతీకారము నాలోచింపుము.

రాజు—చెలికాఁడా! నేనదియే యాలోచించు చున్నాను. దేవిగారియనుగ్రహసంపాదనము తప్ప నాకు మఱియొకయుపాయ మేమియుఁ గనఁబడకున్నది. కాఁబట్టి యక్కడకే వెళ్ళుదము రమ్ము.

(అని నడచు చున్నారు.)

సాగ—ఇప్పుడు స్వయముగా నే యురిపెట్టుకొని ప్రాణత్యాగము చేయుట యుత్తమము. మాసంకేతవృత్తాంతము తెలిసి దేవిగారి చేత నుసంగత పరిభవపఱచఁబడినట్టే నేనును పరిభవింపఁబడుదును. కాఁబట్టి యీలోపలనే నేనశోకవృక్షమువద్దకు వెళ్ళి నాకోరికను నెఱవేర్చుకొనెదను. (అని వెళ్ళుచున్నది.)

వసం—(ఆలకించి) నిలువు; కొంచెమునిలువు. కాలిచప్పుడు వినఁబడుచున్నది. ఒకవేళ పశ్చాత్తాపము తెచ్చుకొని దేవిగారే మరల నిటవచ్చియుందురని నేను భావించెదను.

రాజు—మిత్రుఁడా! అయి యుండవచ్చును. దేవిమహానుభావురాలుకదా? వేగిరము వెళ్ళి చూచి రా.

వసం—దేవరయాజ్ఞాప్రకారము చేసెదను.

(అని వెళ్ళుచున్నాఁడు.)

సాగ—(సమీపించి) కాఁబట్టి నేనీమాధవీలతతో పాశము చేసికొని, అశోకవృక్షమున నురిపెట్టుకొని చచ్చెదను. (అని లతాపాశమును చేయుచు) హాపితా! హామాతా! మందభాగ్యురాలనైన నేనిప్పుడనాథనై దిక్కుమాలి చచ్చుచున్నాను.

(అని కంఠమునందు లతాపాశమును చుట్టుకొను చున్నది.)

వసం—(చూచి) ఏమీ! మరల దేవియైన వాసవదత్తయే వచ్చినది! (తొట్రుపాటుతోబిగ్గరగా) ఓమిత్రుఁడా! వాసవదత్తాదేవి యురిపోసికొని చావఁబోవుచున్నది. రక్షింపుము, రక్షింపుము.

రాజు—(తొట్రుపాటుతో సమీపించి) చెలికాఁడా! ఆమె యెక్కడ? ఆమెయెక్కడ?

వసం—అదిగో.

రాజు—(కంఠమునుండి పాశమునుతీయుచు) ఓసాహసికురాలా! ఏమి ఈయకార్యమును జేయుచున్నావు?

క. నీమెడను బాశముండఁగ,
భామా! కంఠగతమయ్యెఁ బ్రాణంబులు నా
కేమందు నిపుడు? మానుము
నీమృతి కే కాదుగనుక నీయుత్నంబుల్.

సాగ—(రాజునుజూచి తనలో) ఆశ్చర్యముగా నున్నది! ఇది యేమి రాజేయిక్కడకు వచ్చినాఁడు! (సంతోషముతో) ఈయనను జూడఁగానే నాకు మరల జీవితాశ కలుగుచున్నది! అయినను, ఈయన దర్శనముచేత కృతార్థురాలనయి, నేనురిపోసికొని సుఖముగా బ్రాణములు విడిచెదను. (బిగ్గరగా) రాజా! నేను పరాధీనురాలనుగనుక నన్ను విడువుము విడువుము; మరణము నొందుటకు నాకిటువంటి యవసరము మరల దొరకదు. నీవును దేవిగారివిషయమున సాపరాధివి గాకుము.

(అని మరల కంఠమునందు పాశమును బెట్టుకొనఁబోవుచున్నది.)

రాజు—(నిరూపించి సంతోషముతో) ఏమీ! నాప్రియురాలయిన సాగరికగా? (అని కంఠమునుండి త్రాడు లాగి)

గీ. ఇంతిరో! యింతసాహసంబేల నీకు?
వేగ మీలతాపాశంబు విడిచి నీవు
వెడలనుంకించు నాప్రాణవితతిఁ గావ
నిలుపు నీబాహుపాశ మీగళమునందు.

(అని యామె బాహుపాశమును లాగి కంఠమునందుఁ జేర్చుకొని స్పర్శసుఖము నభినయించుచు వసంతకునితో) సఖుఁడా! ఇది మబ్బు లేనివర్షముగా నున్నది!

వసం—మిత్రుఁడా! అకాలవాయువై వాసవదత్తాదేవి రాక పోయినపక్షమున, ఇది యటువంటిదే.

[అప్పుడు వాసవదత్తయు, కాంచనమాలయు ప్రవేశించుచున్నారు.]

వాస—ఓసీ! కాంచనమాలా! ఆప్రకారముగా పాదముల మీఁదఁబడిన ప్రాణవల్లభుని దిరస్కరించివచ్చి నేనతినిష్ఠురమును జేసినదానను. కాఁబట్టి యిప్పుడు నేను నాయంతనేవెళ్ళి భర్తగారి నూఅడించెదను.

కాంచ—దేవిగారుతప్ప మఱియొక రెవ్వరీవిధముగాఁ బలుక నేర్తురు? మంచిది. అతఁడే దుర్జనుఁడు కానిమ్ము; దేవిగారు కావలదు. కాఁబట్టి దేవీ! రమ్మురమ్ము. (అని నడుచుచున్నారు.)

రాజు—ఓసి ముగ్ధురాలా! ఏమి? నీయుపేక్షవలన మేమిప్పు డును విఫలమనోరథుల మగుచున్నాము!

కాంచ—(చెవి యొగ్గి విని) దేవీ! సమీపమున రాజుగారు మాటాడుచున్నారు. అందుచేత నిన్నోదార్చుటకే యాయన వచ్చు చున్నారని నేనూహించెదను. దేవీ! ఎదురుగా వెళ్ళుము.

వాస—(సంతోషముతో) ఆయన చూడకుండ వెనుకనుండి వెళ్ళి కంఠమును కౌఁగిలించుకొని యాయనను మన్నించెదను.

వసం—ఓసాగరికా! ధైర్యమవలంబించి నాప్రియమిత్రునితో మాటాడుము.

వాస—(విని విషాదముతో) కాంచనమాలా! ఏమీ! సాగరికకూడ నిక్కడనే యున్నది! కాఁబట్టి యామాటలు విను

వటలికను వెనుకకు వెళ్ళుదము. (అని తా లాగునఁ జేయుచున్నది.)

సాగ—రాజా! ఈ లేనిదాక్షిణ్యము నేలకనఁబఱచెదవు? నీజీవితమునకంటెను నతిప్రియురా లయిన దేవిగారికి మరల నీవప రాధి వేల యయ్యెదవు?

రాజు—నీ వన్నమాట సత్యము కాదు.

సీ. శ్వాసముచే దేవి స్తనయుగంబు చలింప
నించుక నేనుఁ జలించినాఁడ
ఆమె నాతోడ మాటాడకూరకయున్నఁ
బ్రియవాక్కు లాడితి వినయమునను
భ్రూభంగ మాయమముఖమునఁ గాన్పింపఁ
బదములమీఁద నేఁబడినవాఁడ
సద్వంశమున రాణి జననమొందినదౌట
చేతను నే సేవఁ జేసినాఁడ
నంతెకాని యామెయందుఁ గల్గినయట్టి
ప్రేమ నిక్కమైనప్రేమ గాదు
నీరజాక్షీ నాకు నీమీఁది ప్రేమంబె
స్నేహగరిమచేత నెగడుఁ జుమ్మి.

వాస—(చేరఁబోయి రోషముతో) ప్రాణేశ్వరా! మంచిపని. ప్రాణేశ్వరా! ఇది మంచిపని.

రాజు—(చూచి వెఱఁగుపాటుతో) దేవీ! నిష్కారణముగా నన్ను నీవు నిందింపఁగూడదు. వేషసాదృశ్యమువలన నీవే యని భావించి మే మిక్కడకు వచ్చినాము. కాఁబట్టి క్షమింపుము.

(అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

వాస—(రోషముతో) ప్రాణేశ్వరా! లెమ్ము లెమ్ము. ఇప్పుడును నేను సద్వంశమునందుఁ బుట్టితి ననుహేతువుచేతనే సేవాదుఃఖము ననుభవించుచున్నావా యేమి?

రాగా—(తనలో) ఏమి? దేవి యీమాటయు విన్నది! అందుచే నే నన్నివిధముల చేతను దేవిని శాంతపఱుచునుపాయమును నిరాశచేసుకొన్నాఁడను. (అని క్రిందు చూచుచున్నాఁడు.)

వసం—అమ్మా! ఉరిపెట్టుకొని నీవు ప్రాణత్యాగము చేసికొనుచున్నా వని వేషసాదృశ్యమువలన భ్రమపడి నేను నాప్రియమిత్రుని నిక్కడకుఁ దీసికొనివచ్చినాను. నామాటయందు నీకు నమ్మకము లేనిపక్షమున, ఇదిగో లతాపాశమును చూడు.

(అని లతాపాశమును చూపుచున్నాఁడు.)

వాస—(కోపముతో) ఓసీ! కాంచనమాలా! ఈ లతాపాశముతోనే యీ చెడుబ్రాహ్మణుని కట్టి తీసికొనివచ్చి, యీ దుర్వినీతురాలైనకన్యకను ముందు నడువుమను.

కాంచ—దేవియాజ్ఞాపించినట్లు చేసెదను. (అని లతాపాశమును వసంతకుని మెడకుఁ జుట్టి కొట్టుచు) ఓరి చెడుగా! వెనుకటినీ మిడిసిపాటుఫల మనుభవించు. అప్పుడు దేవిగారి దుర్వచనములచేత చెవులు కటువు లయిన వన్నమాట జ్ఞప్తికిదెచ్చుకో — సాగరికా! నీవును ముందుండుము.

సాగ—(తనలో) పుణ్యవిహీనురాల నైన నేను స్వేచ్ఛగా మరణము నొందుట కయినను చాలకపోయితిని!

వసం—(విషాదముతో) ఓమిత్రుఁడా! దేవిగారిచేత కట్టఁబడి విపత్తులోనున్న దిక్కుమాలిన నన్ను మఱవకుము.

(అని రాజును చూచుచున్నాఁడు.)

వాస—(రాజువంకఁ జూచుచున్నసాగరికను వసంతకుని తీసికొని కాంచనమాలతోడఁగూడ వెళ్ళుచున్నది.)

రాజు—(ఖేదముతో) అయ్యో! కష్టము!

చ. అలుకమెయి స్స్వవర్ణయయినట్టి కులాంగనకై తపించనా?
జళుకుసరాణికింబెగడు సాగరికం గని దుఃఖ మొందనా?
చలమున రాణి కట్టికొనిచన్నవసంతకుఁ గూర్చి కుందనా?
యులజడినొంది యొక్క క్షణమైనను స్వస్థత జెంద నన్నిటన్.

ఇప్పు డిక్కడ నుండుటవలన నేమిప్రయోజనము? దేవిని శాంతపఱుచుట కయి యంతఃపురమునకు వెళ్లెదను.

(అందఱును వెళ్ళుచున్నారు.)

చతుర్థాంకము.

ప్రదేశము— రాచనగరు.

[రత్నహారమును పట్టుకొని, కన్నీరువిడుచుచు సుసంగత ప్రవేశించుచున్నది.]

సుసం—(శోకముతో నిశ్వసించి) హా! ప్రియసఖి! హా సాగరికా! హా లజ్జాళుకా! హా! సఖీజనవత్సలా! హా! ఉదారశీలా! హా! సౌమ్యదర్శనా! నీవెక్కడకు వెళ్ళినావో నాకు ప్రతివచన మిమ్ము. (పయివంకఁజూచి నిట్టూర్పు విడిచి) కరుణలేని యో దైవమా! నీ వటువంటి యసామాన్యరూపశోభావిరాజిత యగుకాంతను సృజించి మఱల నిటువంటి యవస్థాంతర మామె కేల కల్పించినావు? ఆమె తనజీవితమందలి నిరాశచేత నెవ్వని కయిన నొకబ్రా

హ్మణుని కిమ్మని యీరత్నహారమును నాచేతి కిచ్చినది. నేను దీని నేబ్రాహ్మణున కియ్యను? (తెరవంకఁజూచి) అదుగో బ్రాహ్మణుఁడయిన వసంతకుఁ డీవంకనే వచ్చుచున్నాఁడు. 'కాఁబట్టి నేనతనిచేతి కిచ్చెదను.

[అప్పుడు హృష్టుఁడగు వసంతకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

వసం—అహాహా! ఇప్పుడు నాప్రియమిత్రుని యనుగ్రహము చేత పూజ్యురాలైన వాసవదత్తాదేవి నాకట్లువిడిపించి తనచేతితోనే నాకు లడ్డుకములను మోదకములును పెట్టఁగా వానితో నేను కడుపు నిండించుకొన్నాను. ఆమె నాకు రెండుపట్టువస్త్రములను కర్ణాభరణమునుగూడ నిచ్చినది. ఇప్పుడువెళ్ళి నాప్రియమిత్రుని దర్శించెదను.

(అని కొంచెము నడచుచున్నాఁడు)

సుసం—(కన్నీరు విడుచుచు వేగముగావచ్చి) అయ్యా! వసంతకా! ముహూర్తమాత్రము నిలువుము.

వసం—(చూచి) ఏమి! సుసంగతా! ఇక్కడ నీవెందుకేడ్చుచున్నావు? సాగరిక కేమియు నపాయము సంభవించలేదుగదా?

సుసం—అయ్యా! వసంతకా! నేనది నివేదించుటకే వచ్చినాను. భీతురాలయినయామెను దేవిగారుజ్జయినికిఁ బంపినట్లు ప్రవాదము గలుగఁజేసి యర్ధరాత్రమునందుఁ దీసికొనిపోయినారు. ఆమె యెక్కడకు పంపబడినదో తెలియదు.

వసం—(తొందరపాటుతో) హా! సాగరికా! హా! అసామాన్యరూపశోభావిభవా! హా! మృదుభాషిణీ! నీవిప్పు డెక్కడనున్నావో నాకు మాఋపలుకుము. దేవిగారు చేసినపని మిక్కిలి దయారహితముగా నున్నది.

సుసం—అయ్యా! వసంతకా! ఇదిగో రత్నమాల. ఆమె జీవితమునందు నిరాశురాలయి పూజ్యుఁడగు వసంతకున కిమ్మని యీ రత్నహారమును నాచేతి కిచ్చినది. ఇదిగో దీనిని పుచ్చుకొమ్ము.

వసం—(శోకముతో కన్నీరు విడుచుచు కన్నుల నద్దుకొని) ఓసీ! ఇట్టివేళలో దీనిని పుచ్చుకొనుటకు చేతు లెట్లాడును? (అని యిద్దఱు నేడ్చుచున్నారు)

సుసం—(చేతులు జోడించుకొని) అయ్యా! ఆమెయం దైన ననుగ్రహించి, అంగీకరింపుము.

వసం—(కొంచెము చింతించి) కానిమ్ము. దీనిని తీసికొని వెళ్ళి సాగరికావిరహదుఃఖితుఁడయి యున్న ప్రియమిత్రుని నైనను ఊఱడించి యతనికి వినోదము గలిగించెదను.

సుసం—(వసంతకుని చేతిలో రత్నహారమును పెట్టుచున్నది)

వసం—(పుచ్చుకొని చూచి విస్మయముతో) సుసంగతా! ఇటువంటియమూల్యాలంకార మామె కెక్కడనుండి వచ్చినది?

సుసం—అయ్యా! నాకును కుతూహలము గలిగి యామె కీప్రశ్నయే వేసితిని.

వసం—ఆమె యేమని చెప్పినది?

సుసం—అప్పు డామె మీఁదు చూచి నిట్టూర్పు విడిచి, సుసంగతా నన్నిప్పు డాకథ యేల యడిగెదవని యేడ్వ మొదలు పెట్టినది.

వసం—ఆమె చెప్పకపోయినను, సామాన్యజనులకు దుర్లభమైనయీహార మామెకుఁ గలిగి యుండుటచేతనే నిస్సందేహముగా నామె మహావంశసంభూతురాలయి యుండవలెను. సుసంగతా! నాప్రియమిత్రుఁ డిప్పు డెక్కడ నున్నాఁడు?

సుసం—అయ్యా! రాజుగారు దేవిగారి గృహమునుండి వచ్చి యచట స్ఫటిక శిలామండపము నధిరోహించి యున్నారు; నీవక్కడకు వెళ్ళుము. నేనును వాసవదత్తా దేవి పరిచర్యనిమిత్తము వెళ్లెదను.

(అని నిష్క్రమించుచున్నది)

[అప్పుడు పీఠముమీఁదఁ గూరుచుండి రాజు ప్రవేశించుచున్నాఁడు]

రాజు—(ఆలోచించి)

చ. కపటపుబాసలం బ్రియముగన్పడుమాటలఁ జిత్తవృత్తిన్
గృపయొదవించువర్తనల నిం డగుసిగ్గునఁ గాళ్ళ గ్రాలుటన్
నిపుణసఖీసుబోధముల నెమ్మదికోపము పోదు రాణికిన్
జపలతరస్వకీయనయనంబుల నీటనుబోలె నేమిటన్.

(విచారముతో నిట్టూర్పువిడిచి) ఇప్పు డింతవఱకు దేవినే నేను శాంతపఱుచు చుండినను, కేవలమును సాగరికావిషయమయిన చింతయే నన్ను బాధించుచున్నది. ఎట్లన—

గీ. మించుననురాగమునఁ గౌఁగిలించినపుడు
మరుఁడు తొలుత వేసినబాణమార్గమునను
నంబురుహాగర్భసుకుమారయైనకాంత
చని మదీయహృద్గత యయ్యెనని తలంతు.

(ఆలోచించి) నాయూఱట కునికిపట్టు వసంతకుఁడు; అతఁడు దేవిచే కట్టఁబడి యున్నాఁడు. ఇఁక నే నెవరిముందఱఁ గన్నీరు విడుతును?

(అని నిట్టూర్పు విడుచుచున్నాఁడు)

[అప్పుడు వసంతకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

వసం—(వెళ్ళి చూచి విస్మయముతో) నిరంతరమనో వేదన చేత చిక్కినవాఁ డయ్యును శ్లాఘనీయ మయినలావణ్యముతో నుద

యించిన రెండవచంద్రునివలెనే నాప్రియసఖుఁడదె యధికతరముగా ప్రకాశించుచున్నాఁడు. కాఁబట్టి సేనాయనవద్దకు వెళ్లెదను. (అని చేరఁబోయి) ఓమిత్రుఁడా! నీకు శుభ మగుఁగాక! నీవదృష్టవంతుఁడవు. దేవిగారిచేతఁ జిక్కినవాఁడ వయ్యును మరల నేను నిన్నికన్నులతోఁ జూడఁగాంచితి.

రాజు—(చూచి హర్షముతో) ఓహో! నా వసంతకుఁడు నాకు లభించినాఁడు. మిత్రుఁడా! నాకు నీ కౌఁగిలి యిమ్ము.

వసం—(కౌఁగిలించుకొని) ఓ మిత్రుఁడా! దేవిగారిచే నే ననుగ్రహింపఁ బడినాఁడను.

రాజు—నీవు దేవిగారి యనుగ్రహమునుపొందినసంగతి నీ వేష చెప్పుచున్నది. కాఁబట్టి యిప్పుడు సాగరికావృత్తాంతమును జెప్పుము.

వసం—(వెఱఁగుపాటుతో క్రిందుచూచుచు కూరుచున్నాఁడు)

రాజు—మిత్రుఁడా! ఏమి! చెప్పకున్నావు?

వసం—అప్రియమును నీకు చెప్పఁజాలను.

రాజు—(తొందరతోను తొట్రుపాటుతోను) మిత్రుఁడా! అప్రియమేలాగు? ఏమి? నిజముగా నే యామె ప్రాణము విడిచినదా? హా! ప్రియురాలా! సాగరికా! (అని మూర్ఛపోవుచున్నాఁడు)

వసం—(తొట్రుపాటుతో) ప్రియమిత్రుఁడా! ఊరడుమూ ఆడుము.

రాజు—(మూర్ఛ తేఱి కన్నీటితో)

గీ. వేగ, ప్రాణములార! నన్విడచి మీరు
పొందు దక్షిణమునకు నాబుద్ధివించు
వేగఁ బోలేని, మిమ్మామె వెడలలాగు;
దవ్వుగా నేగు నిప్పుడా దంతిగమన,

వసం—మఱియొకవిధముగాఁ దలఁపఁ బోతుము. భీతురా లయిన యామెను దేవిగా రుజ్జయినీనగరమునకుఁ బంపిరని విన్నాను. అందుచేత నే నప్రియ మని చెప్పినాను.

రాజు—ఏమి! ఉజ్జయినికి పంపినదా? రాణి యేమియు నాతోఁ జెప్పకయే చేసినది. మిత్రుఁడా! ఈసంగతి నీతో నెవరు చెప్పినారు?

వసం—సుసంగత. అంతే కాక యెందు నిమిత్తమో కాని యామె యీ రత్నమాలను నాచేతి కిమ్మని పంపినది.

రాజు—మఱి యెందునిమిత్తము? నా కూఱట కలుగునిమిత్తమే. కాఁబట్టి, మిత్రుఁడా! అది యిటు తెమ్ము.

వసం—(ఇచ్చుచున్నాఁడు.)

రాజు—(పుచ్చుకొని చూచి రత్నమాలను హృదయమునందుంచుకొని) ఆహాహా!

గీ. పూర్వ మామెకంఠాశ్లేషమునఁ జెలంగి
యిపుడు భ్రష్ట మయి యుంట నెంచిచూడ
రత్నమాల తుల్యావస్థ రహి వహించి
సఖ యగుచు నాకు నూఱట సలుపుచుండు.

మిత్రుఁడా! ఇది నీకంఠమున ధరింపుము. దీని జూచుచున్నైనను నేను ధైర్యముతో నుండెదను.

వసం—దేవరవా రాజ్ఞాపించినట్లే చేసెదను.

(అని కంఠమున ధరించుకొనుచున్నాఁడు.)

రాజు—(కన్నీటితో నిట్టూర్పువిడిచి) మిత్రుఁడా! ప్రియురాలిపునర్దర్శనము దుర్లభము.

వసం—(భయముతో దిక్కులుచూచి) ఈమాట బిగ్గరగా

వనకుము. ఇక్కడ దేవిగారి పరిచారిక లెవ్వరైనను తిరుగు చుందురు.

[అప్పుడు వసుంధరయను వేత్రహస్త ప్రవేశించుచున్నది]

వసుం—(దగ్గఱగా వచ్చి) మహాప్రభూ! జయమగుఁగాక! జయమగుఁగాక! రుమణ్వంతుని మేనల్లుఁడయిన విజయవర్మ దేవర వారి కేదో నివేదించుట కయి వచ్చి వాకిట నిలిచి యున్నవాఁడు.

రాజు—వసుంధరా! వేగిర మతనిని పిలుచుకొనిరా.

వసుం — దేవరవారి యాజ్ఞాప్రకారముగాఁ జేసెదను. (అని వెళ్ళి విజయవర్మతో మరలఁ బ్రవేశించి) విజయవర్మా! అదుగో రాజుగారు, ఆయనదర్శనము చేసికొమ్ము.

విజయ—(సమీపమునకు వచ్చి) దేవా! మీకు విజయమగుఁగాక! విజయమగుఁగాక! రుమణ్వంతుని విజయముచేత దేవరవా రదృష్టవంతులు.

రాజు—(సంతోషముతో) విజయవర్మా! కోసలరాజు దయింపఁబడినాఁడా?

విజయ— దేవరవారియనుగ్రహమువలన.

రాజు—మేలు! రుమణ్వంతా! మేలు! అచిరకాలములోనే మహాకార్యమును సాధించితివి! — విజయవర్మా! మాకు వినవేడుకగానున్నది గనుక, ఆకథ సవిస్తరముగా వినిపింపుము.

విజ— దేవరవారు చిత్తగించవలెను. దేవరవారి యాజ్ఞచొప్పున మేమిక్కడనుండి కొన్నిదినములలోనే యనేక గజతురగపదాతులచేత ననివార్య మయిన గొప్ప సేనా సమూహమును గూర్చుకొని వెళ్ళితిమి. రుమణ్వంతుఁడు వింధ్యదుర్గమం దున్న కోసలపతి యొక్క ద్వారమున నిలిచి, సేనలతో ముట్టడి వేయుట కారంభించెను.

రాజు—తరువాత తరువాత.

విజ—అప్పుడు కోసలేశ్వరుఁడును అతిదర్పముచేత రుమణ్వంతునివలని పరాభవమును సహింపలేక, గజసమూహబాహుళ్యమయిన తనసైన్యము నంతను యుద్ధమునకు సిద్ధము చేసెను.

వసం—నాహృదయము కంప మొందుచున్నది. వేగిరము చెప్పుం.

రాజు—అనంతరము.

విజ—అతఁడు కృతనిశ్చయుఁడయి,

మహాస్రగ్ధర.

సమరంబున్ జేయ వింధ్యాచలము వెడలి, చంచన్మదేభాళియున్ విం
ధ్యము వేఱొక్కండనంగా దశదిశ లలమన్, దత్క్షణంబే పదాతి
న్గుమిగాఁ ద్రొక్కించి యేనుంగులవితతులచేఁ, గూల్పఁగా బాణవృష్టి
న్సమహోగ్రుండై రుమణ్వంతుఁడురిపుకడమిన్జూచి రెట్టింపుధాటిన్
కవిసె నప్పుడు మఱియును—

చ. శిరసులు బాణఘాతములచేత శిరస్త్రచయంబుతోఁ బడన్
శరములు తాఁకి గాయములజాడను రక్తము జాలువాఱఁగా
సరభసలీల శస్త్రకవచంబులతాఁకున నగ్ని పుట్టఁగా
దుర మొనరించెఁ గోసలుఁడు తూలి ప్రధానబలంబు రూపఱన్.

రాజు—ఇది యేమి! మనబలంబులుసహితము భగ్నము లగుచున్నవి !

విజ—గీ. మన రుమణ్వంతుఁ డొక్కఁడు మొనసి తాఁకి
కుంజరస్థుఁడై పోరాడుకోసలేంద్రు
నుత్తమాంగంబు ఖండించె నొక్కపెట్ట
నిశితవిశిఖశతంబులు నిగుడఁ జేసి.

వసం — జయము కలిగినది! జయము కలిగినది! మన కేజయము కలిగినది! (అని గంతులు వేయుచున్నాఁడు.)

రాజు — మేలు! కోసలరాజా! మేలు! శత్రువులుసహిత మీా పరిశారముగా నీపౌరుషమును వర్ణించుచుండుటచేత నీవు మృతుఁడ వయ్యును శ్లాఘ్యుఁడవే. తరువాత; తరువాత.

విజయ — దేవా! అనంతరము రుమణ్వంతుఁడును కోసలదేశ పరిపాలనమునకయి నాజ్యేష్ఠభ్రాత యుంయనసంజయవర్మను నిలిపి, గాయపడినగజబాహుళ్యము గలసేన నంతను వెంట నడిపించుకొని మెల్లమెల్లఁగా వచ్చుచున్నాఁడు.

రాజు — వసుంధరా! యౌగంధరాయణునికడకుఁ బోయి ప్రియవార్తను దెచ్చినందున కీతనికి మేము బహుమతి నిమ్మన్నా మని చెప్పు.

వసుం — దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అని విజయ వర్మతోఁ గూడ నిష్క్రమించు చున్నది.)

[అప్పుడు కాంచనమాల ప్రవేశించు చున్నది]

కాంచ — 'ఓసీ! కాంచనమాలా! నీవువెళ్ళి యీాఐంద్రజాలి కుని రాజుగారిదర్శనము చేయించు మని దేవిగారు నాకాజ్ఞయిచ్చిరి. (అని కొంచెము నడిచిచూచి) అదుగో రాజుగారు, ఆయనదగ్గఱకు వెళ్ళెదను. (దగ్గఱకు వెళ్ళి) దేవరకు జయ మగుఁగాక! జయ మగుఁ గాక! దేవా! ఉజ్జయినీనగరమునుండి సంవరణసిద్ధి యనునైంద్రజాలి కుఁడు వచ్చి యున్నాఁడని దేవిగారు తమతో విన్నవించు మన్నారు. దేవరవా రాతనికి దర్శన మిత్తురుగాక!

రాజు — మాకు వేడుకగా నున్నది. ఇప్పు డైంద్రజాలికుని శీఘ్రముగా తీసికొనిరమ్ము.

కాంచ—దేవరవారి యాజ్ఞ చొప్పనఁ జేసెదను. (అని వెళ్ళి నెమలిపింఛము చేతఁ బట్టుకొని యున్నయైంద్రజాలికునితోఁగూడ మరల ప్రవేశించుచు)—అయ్యా! రండిరండి.

సంవరణ—(వచ్చుచున్నాఁడు.)

కాంచ—అదుగో ప్రభువువారు. వారిసన్నిధికి వెళ్ళుము.

సంవ—(దగ్గఱకు వెళ్ళి దేవా! జయ మగుఁగాక! జయ మగుఁగాక! (నెమలిపింఛము నాడించుచు నవ్వుచు)

గీ. ఇంద్రజాలనామము గల్గె నెవనివలన
నట్టియింద్రునిచరణంబు లాశ్రియింతు;
విదితయశుఁడయి మఱి జాలవిద్యలకును
గురువయినయట్టి శంబరుఁ గొలుతు నేను.

దేవా! ఏమి కావలెను?

గీ. అవనిమీఁదను జంద్రుఁడో, దివిని నగమొ,
జలములో నగ్నియో, ప్రదోషంబొ పగలు,
ప్రభువువారికి దేనిపై వాంఛ గలదొ
యదియు సిద్ధించు నానతీయంగవలయు.

గీ. హరిహరబ్రహ్మ లాదిగా నఖిలసురల
మింటఁ జూపింతు నిప్పుడ మీకు నేను;
సిద్ధవిద్యాధరామరస్త్రీసమూహ
నృత్యమును మీరు చూడుఁడీ నింగిమీఁద.

వసం—మిత్రుఁడా! జాగ్రత్తగానుండుము. ఇటువంటిగర్వము గలవానికి సర్వము సంభావ్యమేయగును.

సంవ—దేవా! పలుమా టలేల? దేవరవారు మనసులో దేనిని

చూడఁగోరుదురో దానినెల్లను నాగురువుయొక్క మంత్రప్రభావము చేతఁ జూపఁగలను.

రాజు—ఓయీ! దేవివచ్చినదాఁక నుండుము—కాంచనమాలా! దేవిగారికడకుఁ బోయి యీయైంద్రజాలికుఁడు నీవాఁడు; ఈప్రదేశము విజనముగా చేయఁబడినదిగనుకర'మ్మని చెప్పు.ఆమెతో గలిసియే మేమీవినోదమును జూచెదము.

కాంచ—ఏలినవారాజ్ఞాపించినట్లు చేసెదను.(అని వెళ్లి వాసవదత్తా సహితముగా మరల ప్రవేశించుచున్నది.)

వాస—కాంచనమాలా! ఉజ్జయినీనగరమునుండి వచ్చినాఁడన్నమాత్రముచేతనే నా కాయైంద్రజాలికునియందు పక్షపాతము కలుగుచున్నది.

కాంచ—పుట్టినింటివంక వాఁడు గనుక దేవిగారిచే నితఁడాదరింపఁబడఁ దగినవాఁడు. దేవీ! రమ్మురమ్ము. (అనినడచుచు) అదిగో రాజుగారు, సమీపమునకు వెళ్ళుము.

వాస—(దగ్గఱకు వెళ్ళి) భర్తా! జయమగుఁగాక! జయమగుఁగాక!

రాజు—దేవీ! ఇతఁడు బహువాక్యములు పలికినాఁడు. కాఁబట్టి యిక్కడనే కూరుచుండి యిది చూతము.

వాస—(కూరుచున్నది.)

రాజు—ఓయీ! వివిధములయిన నీయింద్రజాలమును గనఁబఱుపుము.

వసం—దేవరవారిసెలవుప్రకారము చేసెదను. (అని బహువిధముల చిందులుత్రొక్కుచు నెమలిపింఛము నాడించుచు 'హరిహర

బ్రహ్మ''లను పద్యమును మరలఁ జదువుచున్నాఁడు. అప్పుడందఱును విస్మయపడి చూచుచున్నారు.)

రాజు—(పయివంకఁజూచి పీఠమునుండి లేచి) ఆశ్చర్యము !

వసం—ఆశ్చర్యము! ఆశ్చర్యము!

రాజు—దేవీ! చూడుము—

సీ. పద్మాసనస్థుఁడై బ్రహ్మదేవుండదె యొక
    చోట వెలుఁగొందుచున్నవాఁడు
శంకరుండల్లదె చంద్రకళావతం
    సుండయి యొకవంక సొగసు మీఱు
దైత్యారి యతఁడె గదాచక్రఖడ్గశా
    ర్ఙ్గకములతో నాల్గుభుజములందు
నైరావతంబెక్కి యతఁడె దేవేంద్రుండు
    తిన్నగాఁ గన్పడుచున్నవాఁడు
చరణములనూపురములు సుస్వరము లీన
దేవతాసుందరులతోడ దినమునందుఁ
దక్కఁగలయట్టి యమరబృందంబు లివిగొ
నృత్యమొనరించెదును గడు నేర్పుమీఱ.

వాస—ఆశ్చర్యము! ఆశ్చర్యము!

వసుం—ఐంద్రజాలికా! మేలుమేలు! నీవు నీ నేర్పునంతను గనఁబఱిచితివి! (రహస్యముగా) ఓరితొత్తుకొడకా! ఐంద్రజాలికా! ఈచూపఁబడిన దేవతలతోడను, అప్సరసలతోడను నాకుపని యేమి! ఈయననుసంతోషపెట్టఁ గలుగుదు వేని, సాగరికను జూపుము.

[అప్పుడు వసుంధర ప్రవేశించుచున్నది.]

వసుం—(రాజు సమీపమునకువచ్చి) భర్తా! జయమగుఁగాక! జయమగుఁగాక ! మంత్రియైన యౌగంధరాయణుఁడు దేవరవారి చరణసన్నిధానమున "సింహళేశ్వరుఁడయిన విక్రమ బాహువుచేతఁ బంపఁబడిన యాతని ప్రధానమంత్రియగు వసుభూతి మనకించుకియైన బాభ్రవ్యునితోఁగూడ వచ్చియున్నాఁడు; ఆతని కీమంచిముహూర్తముననే యేలినవారు దర్శన మియ్యఁదగును. నేను కార్యశేషమును ముగించి దర్శనమునకు వచ్చెదను." అని విన్నపము చేయుచున్నాడు.

వాస—దేవా! కొంచెము సేపింద్రజాలమును చాలింప నియమించి, మా పినతండ్రిగారి యొద్దనుండి ప్రధానమంత్రియైన వసుభూతి వచ్చియున్నాఁడు గనుక ముందుగా దేవరవారాతనికి దర్శన మియ్యవలెను.

రాజు—దేవి చెప్పినట్లు చేసెదను. (ఐంద్రజాలికుని గూర్చి) ఓయీ! నీవిప్పుడు కొంచెము తాళుము.

వసుం—(మరల పింఛము త్రిప్పుచు) దేవరవారి యాజ్ఞాప్రకారము చేసెదను. (అని వెళ్ళుచు) దేవరవారవశ్యముగాఁ జూడఁదగినది నావద్ద నింక వేడుకమాత్ర మున్నది.

రాజు—మేమది తరువాతఁ జూచెదము.

వాస—కాంచనమాలా! ఈతనిని తీసికొనివెళ్ళి పారితోషిక మిప్పింపుము.

కాంచ—దేవిగారాజ్ఞాపించినట్లు చేసెదను. (అని యైంద్రజాలికునితోఁగూడ వెళ్ళుచున్నది.)

రాజు—(వసంతకునివంక తిరిగి) నీ వెదురుగా వెళ్ళి వసుభూతిని తీసికొని రమ్ము.

వసం—దేవర యానతిచ్చినట్లు చేసెదను.

(అని వెళ్ళుచున్నాఁడు.)

[వసంతకుఁ డెమరుగా వెళ్ళి తీసికొనిరాఁగా వసుభూతియు బాభ్రవ్యుఁడును ప్రవేశించుచున్నారు.]

వసం—మంత్రివరా! రమ్ము రమ్ము.

వసు—(అంతటనుగలయఁజూచి) ఆహా! ఉదయనమహారాజ ప్రభావము!

సీ. విజయగజంబుల వీక్షించి ముందుగా
ముఖశాలవాకిట మోదమంది
తరువాత నుత్తమతురగచయంబులఁ
గన్నులపండువు గాఁగఁజూచి
యావలఁ గడుఁ[ఁ]శావ్యమా గానరవమున
కాత్మలో నెంతయు నార్ద్రమొంది
యటుపిమ్మటను దర్శనార్థము వేచెడి
క్ష్మాతలపతులతో క్షణము నిలిచి
వాకిటనె సింహళేశ్వరు వైభవంబు
నెల్ల మఱచితి క్షణములో నిప్పు డేను
ద్వారగతుఁడనై కౌతుకగౌరవమున
గ్రామ్యగతినైతి నగ రెప్డు కననియట్లు.

బాభ్రవ్యు—వసుభూతీ! చిరకాలమున కిప్పుడు ప్రభువును చూడఁగలనను సంతోషాతిశయముచేత నేనో క్రొత్తయవస్థ ననుభవించుచున్నాను. ఎట్లన—

చ. ముదిమిని బుట్టుకంపము ప్రపూర్ణభయంబున వృద్ధిగాంచెడున్
గడరెడుఁ జీకటుల్ మసక గ్రమ్మినదృష్టికి బాష్పవారిచే

గ్గదలికఁ బెంచె గద్గదిక నాదగుస్పష్టము కానివాణికిన్
ముదిమికి సాయ మయ్యెడును భూధవుఁజూచెడు వేడ్క నాకిటన్.

వసం—(ముందుకు వచ్చి) మంత్రివరా! రమ్ము రమ్ము.

వసు—(వసంతకుని మెడలో రత్నహారము చూచి రహస్యముగా) బాభ్రవ్యా! ఇది మనము బయలుదేఱినప్పుడు మారాజుగారు తమ కొమార్తెకిచ్చిన రత్నమాలలాగుననే యున్నది.

బాభ్ర—అమాత్యా! పోలిక యాలాగుననే యున్నది. ఆమెహారము వసంతకుని కెట్లు వచ్చినదో యడిగి తెలిసికొనెదను.

వసు—బాభ్రవ్యా! అడుగవలదు. గొప్పరాజులవద్ద బహురత్నము లుండును గనుక, దానినిపోలినది మాఱియొక భూషణముండుట దుర్లభము కాదు. (అని నడచుచున్నాఁడు.)

వసం—(రాజునుద్దేశించి) వత్సరాజా! అడుగోమంత్రి. ఎదురుగా వెళ్ళుము.

వసు—(దగ్గఱకు వెళ్ళి) దేవా! జయ మగుఁగాక!

రాజు—(లేచి) అభివాదముఁ జేయుచున్నాను.

వసు—దేవరకు గొప్ప శ్రేయస్సు కలుగునుగాక!

రాజు—మంత్రికి పీఠము పీఠము.

వసం—(పీఠము తెచ్చి) అమాత్యా! ఇదిగోపీఠము కూరుచుండుము.

వసు—(కూరుచున్నాఁడు.)

బాభ్ర—దేవా! బాభ్రవ్యుఁడు ప్రణామము చేయుచున్నాఁడు.

రాజు—(వీపుమీఁద చేయివైచి) బాభ్రవ్యా! ఇక్కడ కూరుచుండుము.

బాభ్ర—కూరుచుండి) దేవీ! బాభ్రవ్యుఁడు ప్రణమిల్లుచున్నాఁడు.

వసం—అమాత్యా! అదిగో వాసవదత్తాదేవి ప్రణమిల్లుచున్నది.

వాస—అయ్యా! నమస్కారము చేయుచున్నాను.

వసు—దేవీ! వత్సరాజుతో తుల్యుఁ డయిన సుపుత్రుని గనుము. (అందఱును కూరుచున్నారు.)

రాజు—అయ్యా! వసుభూతీ! మహానుభావుఁ డయిన సింహళేశ్వరునకు కుశలమా?

వసు—(పయివంకఁ జూచి నిట్టూర్పు విడిచి) దేవా! మంద భాగ్యుఁడ నయిన నే నిప్పు డేమని చెప్పుటకును తెలియకున్నది.

(అని కిందు చూచున్నాఁడు)

వసం—(తనలో) ఇతఁ డేమి చెప్పునో తెలిసికోలేకున్నాను.

వాస—(విషాదముతో తనలో) అయ్యో! వసుభూతి యిప్పు డేమి చెప్పునో గదా?

రాజు—వసుభూతీ! ఈవిధముగా నీవేల వ్యాకులపడుచున్నావో నాకుఁ జెప్పుము.

బాభ్ర—(రహస్యముగా) ఆలస్యమేల? చెప్పదగిన దేమో యిప్పుడే చెప్పివేయుము.

వసు—(కన్నీటితో) దేవా! చెప్పుట యశక్యమే యయినను మందభాగ్యుఁడ నయిన నేను దేవరవారికి విన్నవించెదను. సింహళేశ్వరుని కొమార్తె సౌభాగ్యవతి యగు రత్నావళి నేరాజు తనభాగ్యముచేత వివాహమాడఁ గాంచునో యాతఁడు సార్వభౌముఁ డగునని యొకసిద్ధుఁ డానతిచ్చెను.

రాజు—తరువాత; తరువాత.

వసు—సిద్ధదేశమునందలి విశ్వాసముచేత యౌగంధరాయణుఁడు దేవరవారి నిమిత్తము పలుమాఱు ప్రార్థించినను వాసవదత్తకు మనఃఖేదము కలుఁగు నని సింహళేశ్వరుఁ డామె నిచ్చుట కొప్పుకొనకపోయెను.

రాజు—(రహస్యముగా) దేవీ! నీ పినతండ్రి మంత్రి యిప్పు డేమి యీలాగున నబద్ధము చెప్పుచున్నాఁడు?

వాస—(ఆలోచించి) ప్రాణేశ్వరా! ఇక్కడ నెవ రబద్ధ మాడుచున్నారో నేను తెలియఁజాలను.

వసం—ఆమె కేమి సంభవించినది?

వసు—అనంతరము లావణకమునందు వాసవదత్తాదేవి కాలి చచ్చిపోయినదని జనప్రతీతిని కలిగించి, సింహళేశ్వరునికడకు బాభ్రవ్యుని బంపి యాకన్య నిమ్మని మరల నడిగించెను. తరువాత మారాజు కొంతచింతించి, దేవరవారితోడి తమసంబంధము లోపించరా దని యారత్నావళిని దేవరవారి కిచ్చుటకుఁ బంపఁగా, మేమామెను వెంటఁబెట్టుకొని వచ్చునప్పుడు సముద్రములో నోడ పగిలి యామె మునిఁగిపోయినది. (అని యేడ్చుచు తల వంచుకొను చున్నాఁడు.)

వాస—(కన్నీటితో) అయ్యో! నేను చెడితిని! హా! మందభాగ్యురాలా! హా! సోదరీ! రత్నావళీ! నీ విప్పు డెక్కడ నున్నావు? నాకు ప్రతివచన మిమ్ము.

రాజు—ఊరడుము. ఊరడుము. దైవగతి మనకు దురవగాహము. ఓడ పగిలి మునిఁగిపోయినవారును మరల తేచివత్తు రనుటకు నీకు వీరే నిదర్శనముగా నున్నారు. (అని వసుభూతిని బాభ్రవ్యుని జూపు చున్నాఁడు.)

వాస—ప్రాణేశ్వరా! అట్లే యగునుగాక! నా కంతటిభాగ్య మేలాగునఁ గలుగును?

రాజు—(రహస్యముగా) బాభ్రవా! దీనివాస్తవ మేమి? నాకేమియుఁ దెలియకున్నది.

బాభ్ర—దేవా! వినుండి.

[తెరలోపల గొప్పకలకలము]

ఉ. జ్వాలలగుంపు హర్మ్యముల బంగరుశృంగపుటింపు నింపఁగాఁ,
గీలలనిండు వేఁడిమి నొగిం బువుఁదోఁటలచెట్లు వాడఁగా,
నీలపయోదశోభ నిడ నిక్కని ధూమము కృత్రిమాద్రికిన్,
స్త్రీలు తలంక నంతిపురిఁ జేరె హఠాత్తుగ నగ్ని యియ్యెడన్.
గీ. లావణకము చెంత దేవి కాలి గతించె
నన్నయాప్రవాద మరయ నిపుడు
సత్యమౌ ననంగ జ్వాలాసమూహంబు
పొదివి యొకట నంతిపురిని గ్రమ్మె.

(అందఱును తొందరపడి చూచుచున్నారు)

రాజు—అంతఃపురమున నగ్ని పుట్టినదాయేమి? (తొట్రుపాటుతో లేచి) అయ్యో! వాసవదత్త కాలిపోయినదేమో! హా వాసవదత్తా! హా ప్రియురాలా!

వాస—ఇది యేమి విభ్రాంతి? నేను మీపార్శ్వమున నే యున్నాను. ఓరాజా! కాపాడుము, కాపాడుము.

రాజు—దేవీ! తత్తరపాటువలన పార్శ్వస్థురాలవయి యున్నను నిన్ను చూడలేకపోయితిని! (అని యామెచేయి పట్టుకొని) దేవీ! ఊఱడుము.

వాస—ప్రాణేశ్వరా! ఈమాట నన్నుఁగూర్చి నేను చెప్పలేదు. దయమాలినదానవయి నేనక్కడ సాగరికను గొలుసులు వేసి కట్టిపెట్టి యుంచినదానను. అది విపత్తు నొందుచున్నదిగనుక దానిని కాపాడుము.

రాజు—ఏమీ! సాగరిక విపత్తులో నున్నదా? అక్కడకు వెళ్లెదను.

వసు—దేవా! ఏమి? నిష్కారణముగా మిడుతవలె నగ్నిహోత్రముమీఁది కుఱుక సాహసించుచున్నావు!

బాభ్ర—దేవా! వసుభూతి యుక్తమయినమాట చెప్పినాఁడు.

వసు—(రాజు నుత్తరీయముతో పట్టుకొని) మిత్రుఁడా! సాహసము చేయకుము.

రాజు—(ఉత్తరీయమును లాగుకొని) ఓరిమూర్ఖుఁడా! సాగరిక విపత్తు నొందుచున్నది. ఇప్పుడును నేను ప్రాణములను దాఁచుకొందునా? (అని యగ్నిప్రవేశమును నటించి, పొగలో బాధపడుచున్న ట్లభినయించుచున్నాఁడు)

బాభ్ర—ఏమి? ఈస్వల్పవిషయమున భరతకుల మింతటితో నశింపవలసినదా? వట్టిమాటలతో నేమి ప్రయోజనము? నేనును స్వామిభక్తికిఁ దగినట్లు నడచెదను.

రాజు— [మార్పుమీ;

చ. జ్వలన! ప్రశాంతిఁ బొందుము; ప్రశాంతిని బొందుము; ధూమ
నిలువక మంటగుంపులను నీవిటు లేటికిఁ జేర్చె దేవు మైఁ?
దలఁపఁ బ్రియావియోగశిఖదగ్ధుఁడఁగాక చెలంగు నన్ను నీ
ఖిల నిఁక నేమిచేయఁగల వీప్రళయాగ్నిశిఖాసమృద్ధిచేన్?

వాస—ఏమీ! దుఃఖభాజన మయిననావచనముచేత నేప్రాణేశ్వరున కీవిధావస్థ సంభవించినది! ఇక్కడనుండి నేనేమి చేయుదును? నేనును ప్రాణేశ్వరునితోడనే చనియెదను.

వసం—అమ్మా! నేను నీకు ముందుగా దారి తీసెదను.

వసు—ఏమీ! వత్సరాజు వహ్నిలోనే ప్రవేశించినాఁడు! రాజపుత్రికయొక్క విపత్తును జూచి యిక్కడనే దేహము విడుచుట నాకును యుక్తము.

బాభ్ర—హా! మహారాజా! ఏమి? నిష్కారణముగా భరతకులమునకు సంశయస్థితిని దెచ్చినావు! నేను ప్రభుభక్తికిఁ దగినట్లు ప్రవర్తించెదను. (అని యందఱును అగ్నిప్రవేశమును నటించుచున్నారు)

రాజు—(కుడిభుజ మదరుటచూచి) ఈయవస్థలోనున్న నాకు దీనివలన నేమిఫలముకలుగును? (ముందుకుచూచి హర్షముతోడి తత్తఱపాటుతో) అదిగో వహ్నిజ్వాలలు సమీపింపఁగా సాగరిక కనఁబడుచున్నది. నేను వేగిరము వెళ్ళి యామెను కాపాడెదను.

[అప్పుడు సంకిళ్ళతో సాగరిక ప్రవేశించుచున్నది]

సాగ—(అంతటను గలయఁజూచి) నాభాగ్యముచేత నగ్నిహోత్రుఁడంతటను ప్రజ్వరిల్లుచున్నాఁడు. ఇప్పుడు నాకు దుఃఖావసానము కలుగును.

రాజు—(వేగముగాచేరఁబోయి) ఓప్రియురాలా! ఏమి? ఇప్పుడు సహితము ప్రాణము నుపేక్ష సేయుచున్నావు!

సాగ—(రాజునుజూచి తనలో) ఏమీ! నాప్రియతమునిజూచి

మరల నాకు జీవితాశ కలుగుచున్నది! (ప్రకాశముగా) భర్తా! రక్షింపుము; రక్షింపుము.

రాజు—ఓసి పిఱికిదానా! భయపడకుము.

గీతపద్యము—క్షణము సహియింపు మీధూమసంచయంబు;
(ముందువంకఁజూచి) అకట! మండెడు స్తనగళితాంశుకంబు;
(నిపుణముగాఁజూచి) తలఁకె దేటికి? సంకిళ్ళు దాల్ప నేల?
వడిగ నినుఁగాతు; నన్నీవు పట్టుకొమ్మ.

(అని కంఠమును కౌఁగిలించుకొని కన్నులుమూసికొని స్పర్శసుఖము నభినయించుచు) ఆహా! నాసంతాపమంతయు క్షణములో పోయినది. ఓప్రియురాలా! ఊఱడుము; ఊరడుము.

గీ. సుదతిరో! నిన్ను స్ఫుటముగాఁ జుట్టుకొనియు
నగ్నిహోత్రుఁడు నిను గాల్పఁడయ్యె నిపుడు;
తలఁచిచూడంగ నాతనితాపమునును
నీదు స్పర్శమె హరియించు నిక్కముగను.

(కన్నులు తెఱచిచూచి) ఓహో! మహాశ్చర్యము! ఈయగ్నిహోత్ర మేమయిపోయినది? అంతఃపురముయొక్క యిప్పటియవస్థ యేమయినది? (వాసవదత్తను జూచి) ఏమి? ఈమె యవంతిరాజతనయా?

వాస—(సంతోషముతో రాజశరీరమును తడివి చూచుచు) ప్రాణేశ్వరా! భాగ్యవశమున మీరు రక్షితశరీరులుగా నున్నారు.

రాజు—ఇతఁడు బాభ్రవ్యుఁడా!

బాభ్ర—మహారాజా! మీకు జయమగుఁగాక! పుణ్యవశమున దేవర తిన్నగా నుండుటచేత మేము మరల ప్రాణములు గలవార మయితిమి.

రాజు— ఇతఁడు వసుభూతియా?

వసు— దేవా! అదృష్టముచేత వర్ధిల్లుచున్నావు.

రాజు—మిత్రుఁడా!

వసం— దేవరకు జయమగుఁగాక!

రాజు—(ఆలోచించి వితర్కముతో) ఇది స్వప్నమా? మతి భ్రమా? లేక యింద్రజాలమా?

వసం—మిత్రుఁడా! సందేహింపఁబనిలేదు. ఇదియింద్రజాలమే తొత్తుకొడు కాయైంద్రజాలికుఁడు వెళ్లునప్పుడు దేవరవారింకొక వినోదము నవశ్యముగాఁ జూడవలెనన్నాఁడు. అదేయిది.

రాజు— దేవీ! నీమాటలనుబట్టి సాగరికనిప్పుడీవలకుఁదీసికొని వచ్చినాఁడను.

వాస—(నవ్వి) ప్రాణేశ్వరా! నాకంతయుఁ దెలియును.

వసు—(సాగరికనుజూచి రహస్యముగా) బాభ్రవ్యా! ఈమె మనరాజపుత్రికవలె నున్నది,

బాభ్ర—అమాత్యా! నాకును నాలాగుననే కనఁబడుచున్నది.

వసు—(ప్రకాశముగా రాజుతో) దేవా! ఈకన్యక యెక్కడిది?

రాజు— దేవి యెఱుఁగును.

వసు— దేవీ! ఈకన్యక యెక్కడిది?

వాస—అమాత్యా! ఈచిన్నది సముద్రమున దొరకినదని చెప్పి మంత్రియైన యౌగంధరాయణుఁడు నాకొప్పగించినాఁడు. అందుచేత నే యిది సాగరిక యనఁబడుచున్నది.

రాజు—(తనలో) ఏమి! యౌగంధరాయణుఁడు నాతోఁ గొంచెమయినను జెప్పక పోయెను! అతఁడీమెను రాణి కేలయర్పించి యుండును?

వసు—(రహస్యముగా) బాభ్రవ్యా! ఈపోలికయు వంసతకుని కంఠమునందలి రత్నమాలయు నీమె సాగరమునుండి దొరకుటయు విచారింపఁగా నీమె సింహళేశ్వరపుత్రిక యయినరత్నావళియయినట్లు స్పష్టమగుచున్నది. (అని సమీపమునకు వెళ్ళి బిగ్గరగా) అమ్మా! రత్నావళీ! రాజపుత్రీ! నీవిటువంటియవస్థను పొందియున్నావా?

సాగ—(వసుభూతిని జూచి కన్నీటితో) అయ్యో! మంత్రీ! వసుభూతీ!

వసు—ఆహా! చెడితిని! నేను మందభాగ్యుఁడను. (అని భూమిమీఁద పడుచున్నాఁడు.)

సాగ—హా! మందభాగ్యురాల నయిననేను చెడితిని. హా తండ్రీ! హా తల్లీ! మీరెక్కడనున్నారు? నామాటకు మాఱుపలుకుఁడు. (అని సంతాపించుచు మూర్ఛపోవుచున్నది.)

వాస—(తొట్రుపాటుతో) బాభ్రవ్యా! ఈమె నాతోఁబుట్టిన పడుచైన రత్నావళియా?

బాభ్ర—అవును. ఈమె నీచెల్లెలే.

వాస—(రత్నావళిని కౌఁగిలించుకొని) సోదరీ! ఊఱడుము; ఊఱడుము.

రాజు—ఏమీ! గొప్పవంశమునందుఁ బుట్టినసింహళేశ్వరుఁడయినవిక్రమబాహునికూఁతురా యీమె?

వసం—(తనలో) రత్నమాలను చూచినప్పు డిటువంటిరత్నమాల సామాన్యజనుల కుండదని నేను మొట్టమొదటనే తెలిసికొన్నాఁడను.

వసు—రాజపుత్రీ! ఊఱటపొందుము. ఊఱటపొందుము

పెద్దదయినసీయుప్ప నీకొఱకు దుఃఖించుచున్నది; ఆమె నాలిగనము చేసికొమ్ము.

రత్నా—(ఊఁఅడిల్లి క్రిందిచూపున రాజును జూచి తనలో) నేనపరాధము చేసియున్నదానను గనుక దేవికి ముఖమును చూపఁ జాలకున్నాను. (అని యధోముఖ యగుచున్నది.)

వాస—(బాహువులుసాఁచి కన్నీటితో) రమ్ము. అతినిష్ఠుర రాలనైన నాప్రియసోదరీ! ఈలాగునవచ్చి నీస్నేహమును గనఁబఱుపుము. (అని కంఠమును కౌఁగిలించుట నటించి, రాజుతో రహస్యముగా) ప్రాణేశ్వరా! నేను చేసినక్రూరకృత్యముచేత నాకు సిగ్గగుచున్నది. కాఁబట్టి యీమెయీబంధమును శీఘ్రముగావిడిపింపుము.

రాజు—(సంతోషముతో) దేవిచెప్పినట్లు చేసెదను. (అని సాగరికకట్లు విప్పుచున్నాఁడు.)

వాస—ప్రాణేశ్వరా! మంత్రియైన యౌగంధరాయణుఁడే నన్నింతకాలము క్రూరురాలినిగాఁ జేసినాఁడు. అతఁడు నిజము తెలిసినవాఁ డయ్యును చెప్పినవాఁడు కాఁడు.

[అప్పుడు యౌగంధరాయణుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

యౌగం—

ఉ. నావచనంబునం గలిగె నాథువియోగము రాణి కెంతయున్;
దేవికి సంభవించు సవతింగనుదుఃఖము; నందుచేత నే
శ్మావరుఁ డొందు సర్వమహి; మన్ననసేయునెవఁడ్చు దేవి న
న్నావిధమయ్యు నాదుమొగ మాపెకుఁజూపఁగ లజ్జయయ్యెడున్.

అట్లు కాకపోయిన మఱి యేమి చేయను? నిశ్శంకముగా కార్యనిర్వహణము చేయువాఁడు మాననీయులయెడలసహితము నిటువంటిస్వామి

భక్తివ్రతమును నాలుపనేవలయును. (చూచి) అదె మహారాజుగారు సన్నిధికి వెళ్ళెదను. (సమీపించి) దేవా! జయ మగుఁగాక! జయ మగుఁగాక! దేవరవారికి నివేదింపకుండఁ జేసిన కార్యమున కయి నన్ను క్షమింపుఁడు. (అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

రాజు—మాకు నివేదింపకుండ నీవే కార్యమును జేసితివి?

యౌగం—దేవరవారు పీఠమును పరిగ్రహింపుఁడు. సమస్తమును విజ్ఞాపనము చేసెదను.

[రాజుతోఁగూడ నందఱును స్వస్థానములఁ గూరుచున్నారు.]

యౌగం—దేవా! వినుఁడు. ఈమె సింహళదేశాధీశ్వరుని కొమార్తె. ఈమెను పాణిగ్రహణము చేసికొన్నవాఁడు సార్వభౌముఁడగు నని యొకసిద్ధునివలన నెఱిఁగి యాతనివచనమునందులినమ్మకము చేత నేను పలుమాఱు దేవరవారి కీమె నిమ్మని సింహళేశ్వరునిఁ బ్రార్థించినను వాసవదత్తాదేవికి మనోవ్యధ కలుగునని యాతఁడిచ్చినవాఁడు కాఁడు.

రాజు—తరువాత నేమి జరిగినది?

యౌగం—(లజ్జతో) అప్పుడు లావణకమున దేవి కాలిపోయిన దని ప్రవాదము కలిగించి యాతనిసమ్ముఖమునకు బాభ్రవ్యునిఁ బంపినాఁడను.

రాజు—యౌగంధరాయణా! తరువాతిసంగతి మేము విన్నారము. ఏమి యాలోచించి యీమెను దేవిగారి కొప్పగించినావు?

వసం—మిత్రుఁడా! ఈతఁడు చెప్పకయే యీతనియభిప్రాయము నాకు తెలిసినది. ఈమె యంతఃపురమున నుండినచో మీరంతఃపురమునకు వెళ్ళినప్పుడు మీకు సులభముగా కనఁబడునని,

రాజు—యౌగంధరాయణా! వసంతకుడు నీయభిప్రాయమును తిన్నగా గ్రహించినాడా?

యౌగం—దేవరవా రన్నట్టే.

రాజు—ఐంద్రజాలికుని కృత్యముసహితము నీపనియే యని తలంచెదను.

యౌగం—అట్లుగాకపోయినయెడల, అంతఃపురమున బంధింపబడియున్న యీ యామెకు దేవరవారి సందర్శన మెట్లు కలుగును? ఈమె కనంబడకున్న వసుభూతి యీ యామె నెట్లానవాలు పట్టగలుగును? (నవ్వుచు) ఇప్పుడు సంగతి తెలిసినది గనుక, ఇంకమీంద చెల్లెలి విషయమయి యేమి జరగవలయునో యిప్పుడు దేవి నిర్ణయింపవలసి యున్నది.

వాస—(చిఱునవ్వుతో) అయ్యా! అమాత్యా! రత్నావళిని రాజుగారి కిమ్మని స్పష్టముగానే చెప్పరాదా?

వసం—అమ్మా! మంత్రియభిప్రాయమును సరిగానే కనిపెట్టినావు.

వాస—(చేతులు సాంచి) రమ్ము. రత్నావళీ! రమ్ము. ఇప్పుడు నా తోడంబుట్టినదాన వయినందుకు తగినట్లుకమ్ము. (అని రత్నావళిని తననగలతో నలంకరించి చేయి పట్టుకొని రాజుదగ్గరకు వెళ్ళి) దేవా! ఈరత్నావళిని ప్రతిగ్రహింపుము.

రాజు—(సంతోషముతో చేతులు చాంచి) దేవిగారి ప్రసాదము నెవరు మన్నింపకుందురు? (అని సాగరికను పరిగ్రహించుచున్నాఁడు.)

వాస—ప్రాణేశ్వరా! ఈమెబంధువులు దూరమున నున్న వారు; కాఁబట్టి యీమె తన బంధుబృందము నెప్పుడును దలంప కుండునట్లుగా నీమెవిషయమున నడుచుకొమ్ము.

రాజు—దేవి యాజ్ఞాపించినట్లే నడుచుకొనెదను.

వసం—(సంతోషముతో నృత్యము చేయుచు) ఇహిహీ! ఓహో! దేవరకు జయమగుఁగాక! భూమండల మంతయు నిప్పుడు నాప్రియమిత్రునియొక్క హస్తగత మైనది.

వసు—రాజపుత్రీ! వాసవదత్తాదేవికి నమస్కారము చేసి గౌరవింపుము.

రత్నా—(అప్రకారముగా చేయుచున్నది.)

బాభ్ర—(వాసవదత్తనుజూచి) దేవీశబ్దధారణమునకు నీవే తగినదానవు.

వాస—(రత్నావళిని కౌఁగిలించుకొని దేవీశబ్దముచేత ప్రసాదము చూపుచున్నది.)

బాభ్ర—నేను పడ్డ శ్రమయంతయు నిప్పుడు సఫల మైనది.

యౌగం—దేవా! నేను దేవర కింకను నేమి ప్రియముచేయ వలయునో సెలవిండు.

రాజు—ఇదిగాక యింకను బ్రియ మేమి గలదు?

ఉ. విక్రమబాహుతో నొదవె వియ్యము; రాజ్యముసుర్వలభించె; భూ
చక్రము చేపడం దొరకె సాగరికాసతి సారభూతయై;
యీక్రియఁ జెల్లెలిం బడసి యెంతయు మోదముఁ జెందె రాణి; ని
ర్వక్రతఁ గోసలుల్ గడుఁబరాజితులైరి; మ రేమికోరుదున్?

అయినను,

పంచపాది.

గీ. వసుధ సస్యాఢ్య యగుఁగాక ! వాసవుండు
వాన లిచ్చుఁగాక! సదనుష్ఠానములకు
ద్విజులు తనియింపుదురుగాక త్రిభువనముల!
సుఖ మగునుగాక సతతంబు సుజనతతికి !
దుర్జనకఠోరభావలు దొలఁగుఁగాక !

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము.

బాక్సు ముద్రాక్షరశాల, రాజమండ్రి—1950.

మాళవికాగ్నిమిత్రము

ఇది

కాళిదాస ప్రణీతమైన సంస్కృతగ్రంథమునుండి

రావుబహదూర్

కందుకూరి వీరేశలింగము పంతులు గారిచే

ఆంధ్రీకరింపబడినది.



ప్రకాశకులు:

హితకారిణీసమాజము

రాజమహేంద్రవరము

1950

మొదటికూర్పు పీఠిక

మాళవికాగ్నిమిత్రము కథ మిక్కిలి యింపయినది. ఈనాట
కము గీర్వాణకవిమండలాగ్రగణ్యుఁ డైన కాళిదాసునిచే రచియింపఁ
బడినది. ఇదియభిజ్ఞానశాకుంతలమును రచియించిన కాళిదాసునిచేతఁ
గాక మఱియొక కాళిదాసునిచేత రచియింపఁబడినదని కొందఱు చెప్పు
దురుగాని యందుకు తగిననిదర్శన మేదియు లేదు. ఇందలి కథా
నాయకుఁ డగ్నిమిత్రుఁడు. ఇతఁడు శుంగవంశపురాజయినపుష్ప
మిత్రుని కుమారుఁడు. ఈపుష్పమిత్రుఁడు మొదట మగధదేశపురా
జయినబృహద్రథుని సేనాధిపతిగా నుండి యతనిని చంపి, మౌర్య
మంత్రిని చెఱయందుఁ బెట్టించి, ఆతనిరాజ్యము నాక్రమించుకొని
విదిశానగరము తనకు రాజధానిగాచేసికొనెను. అందుచేతనే యాత
నికి సేనాధిపతి యని పేరుండెను. ఇతఁడు విక్రమార్కశకమునకు
పూర్వము నూటయిరువదిరెండుసంవత్సరములక్రిందట సింహాసనము
నకు వచ్చెను. ఇతఁడు సింధునది సమీపమున గ్రీకుదేశస్థులతో
యుద్ధము చేసి వారిని జయించెను. ఇతఁడు తనవార్ధకదశయందు తన
కుమారుఁ డయినయగ్నిమిత్రునకు రాజ్య మిచ్చి తానాధ్యాత్మిక
విషయమున కాలము గడుపుచుండెను. ఈకాలములో తండ్రికిని
కొమారునికిని కొన్ని విషయములయందుపడకపోయెను. అగ్నిమిత్రుడు
ముప్పదియాఱుసంవత్సరములు రాజ్యముఁ జేసి మృతినొందఁగా, అనం
తర మతనికొమారుఁడు వసుమిత్రుఁడు రాజ్యమునకువచ్చి యెనిమిది
సంవత్సరములు పాలనము చేసెను.

ఈమాళవికాగ్నిమిత్రము నాకు మూఁడుప్రతులు లభించినవి. ఈదేశపుప్రతికిని వంగదేశపుప్రతికిని బహుస్థలములయందు భేదము కనఁబడుచున్నది. నేను దీనిని తెనిగించుటలో విశేషభాగము వంగదేశపుపండితుఁడయిన తారానాథ తర్కవాచస్పతి ప్రతి ననుసరించినను, అక్కడక్కడ కొన్నిస్థలములయం దీదేశపుపాఠము ననుసరించి కొన్నిమార్పులనుసహితము చేసినాను. గుణగ్రహణపారీణులు దీనియందలిదోషములను మన్నించి గుణమును గ్రహింతురుగాక!

రాజమహేంద్రవరము
ది ౧౬ ఏప్రియల్ ౧౮౮౯ సం॥ } కందుకూరి వీరేశలింగము

ఈ నాటకమునందు వచ్చు పాత్రములు.

పురుషులు.

అగ్నిమిత్రుఁడు—కథానాయకుఁడైన విదిశానగరపురాజు.

వాహతకుఁడు—మంత్రి.

గౌతముఁడు—విదూషకుఁడు.

హరదత్తుఁడు—నాట్యాచార్యుఁడు; ఇరావతి గురువు.

గణదాసుఁడు—నాట్యాచార్యుఁడు; మాళవిక గురువు

మౌద్గల్యుఁడు—కంచుకి.

వీరసేనుఁడు—ఒకసేనానాయకుఁడు; రాణితమ్ముఁడు.

ధ్రువసిద్ధి—విషవైద్యుఁడు.

యజ్ఞసేనుఁడు—విదర్భదేశపురాజు.

మాధవసేనుఁడు—మాళవిక యన్న; విదర్భదేశపురాజు.

వసుమిత్రుఁడు—అగ్నిమిత్రుని కొమారుఁడు.

పుష్పమిత్రుఁడు—అగ్నిమిత్రుని తండ్రి.

సుమతి— మాధవసేనుని మంత్రి.

సారసకుఁడు—కుబ్జుఁడు.

స్త్రీలు.

ధారణి—అగ్నిమిత్రుని పట్టపుదేవి.

ఇరావతి—అగ్నిమిత్రుని భోగభార్య.

కౌశికి(పరివ్రాజిక)—సుమతిచెల్లెలు, రాణికి ధర్మకథలు చెప్పునది.

మాళవిక—కథానాయకురాలు; మాధవసేనుని చెల్లెలు.

బకుళావళిక—మాళవిక చెలికత్తె.
నిపుణిక—ఇరావతి పనికత్తె.
చంద్రిక—ఇరావతి పనికత్తె.
జయసేన—అంతఃపురద్వారపాలకురాలు.
మధురిక—వనపాలకురాలు.
వసులక్ష్మి—రాజుకూఁతురు.
కౌముదిక—రాణిగారి పనికత్తె.
సమాహితిక—పండితకౌశికి పనికత్తె.
రజనిక—విదర్భదేశమునుండి వచ్చిన పాటకత్తె.
జ్యోత్స్నిక—విదర్భదేశమునుండి వచ్చిన పాటకత్తె.

మాళవికాగ్నిమిత్రము

ప్రథమాంకము.

నాంది.

చ. ఎతఁడు మహేశుఁడై ఫలము లిచ్చి నతాళికిఁ దోలుదాల్చుఁడా,
నెతఁడు జితేంద్రియుండయియతీశుఁడగుస్సతి మేనఁదాల్చియుఁ౯,
ఎతఁ డలయిష్టమూర్తులను నేలుచు లోకము గర్వికాఁడు తా,
నతఁడు వివేక మిచ్చి హృదయంబులఁ దామసవృత్తిఁ బాచుత౯

సూత్రధారుడు—అతివిస్తారము పనిలేదు. (తెరవంకఁజూచి) అయ్యా! కొంచె మిటురమ్ము.

పారిపార్శ్వకుఁడు—(ప్రవేశించి) బావా! ఇదిగో వచ్చినాను.

సూత్రి—శ్రీకాళిదాసకృతమైన మాళవికాగ్నిమిత్ర మను పేరుగల నాటకము నీవసంతోత్సవమునం దాడవలసిన దని యీ సభవారిచే నేనాజ్ఞాపింపఁబడినాను. కాఁబట్టి సంగీత మారంభింతము.

పారి—అదికూడదు. సుప్రసిద్ధు లయిన ధావక సౌమిల్ల కవి పుత్రాదులు కల్పించిన నాటకములను మాని వీరు వర్తమానకవి కాళిదాసునికృతి నేల బహుమానించుచున్నారు?

సూత్రి—ఓవివేకీ! నీవు చెప్పినది సరికాదు. చూడు.—

గీ. సర్వమును బ్రాంత దని యొందు సాదుగాదు
క్రొత్తదని యొ కావ్యమునకుఁ గొఱఁతరాదు

యోగ్యులు గ్రహింతు రారసి యుత్తమంబు
మూఢుఁ డన్యులనే నమ్ము బుద్ధిలేక.

పారి—అందున కీసభవారే ప్రమాణము.

సూత్ర—అట్లయిన నీవు త్వరపడుము.

గీ. అతులసేవాసమర్థురా లైనయట్టి
యల్ల ధారణిసేవకురాలి వలెనె
యేను దాలుతను శిరసావహించినట్టి
యీసభికనియోగ మొనర్ప నిచ్చగింతు.

(అని యిద్దఱును బోవుచున్నారు.)

ఇది ప్రస్తావన.

[అప్పుడు వకుళావళిక ప్రవేశించుచున్నది.]

వకు—క్రొత్తగా నేర్చుకొనుచున్న చలిక మనునాటకము నందు మాళవిక యెట్లున్నదో నాట్యాచార్యుఁడయిన గణదాసు నడిగి రమ్మని ధారణీదేవి నా కాజ్ఞ యిచ్చినది. కాఁబట్టి నేను సంగీత శాలకు వెళ్ళెదను. (అని నడచుచున్నది.)

[అంతట ఆభరణమును చేతఁబట్టుకొని రెండవచేటిక
ప్రవేశించుచున్నది.]

ప్రథమ—(రెండవదానిని జూచి) ఒసీ! కౌముదికా! నీ కీ ధైర్యమేమే! నాదగ్గఱనుండియే దాఁటిపోయెదవు, నన్ను కంటఁ జూడకున్నావు.

ద్వితీయ—ఓహో! వకుళావళికా! ఇప్పుడే నేను శిల్పివద్ద నుండి తీసికొనివచ్చుచున్న దేవిగారి యీ సర్పముద్రికల ముద్దు

టుంగరమును గుఱించి యాలోచించుచు నీచేత దూషణ పడవలసిన దాన నైతిని.

వకు—(చూచి) నీదృష్టి తగినదానియందే బడినది! మెఱుంగులు గ్రక్కుచున్న యీ యుంగరముచేత నీ హస్తశాఖ పుష్పించినట్టున్నది.

కౌము—ఓసీ! నీ వెక్కడకు వెళ్ళుచున్నావు?

వకు—చెప్పినదానిని మాళవిక యెట్లు గ్రహించుచున్నదో యడుగుటకయి దేవిగారి యాజ్ఞాప్రకారముగా నాట్యాచార్యుఁడైన గణదాసునియొద్దకు వెళ్ళుచున్నాను.

కౌము—సఖీ! ఆమె యిటువంటివ్యాపారముచేత దూరస్థురాలుగా నున్నను రాజుచేత నెట్లు చూడఁబడినది?

వకు—అతఁడామెను దేవిగారిపార్శ్వమునందుఁజిత్తరువులోఁ జూచినవాఁడు.

కౌము—ఏలాగున?

వకు—విను. దేవి చిత్రశాలకుఁబోయి, అప్పుడే శిల్పాచార్యుఁడు రంగువేసి తెచ్చిన చిత్రలేఖను జూచుచు నిలుచుండెను. ఇంతలో రాజును వచ్చెను.

కౌము—అటుతరువాత?

వకు—ఉపచారమయినతరువాత నేకాసనమునందుఁ గూరుచుండి, రాజుగారు చిత్రఫలకమునందు పరిజనమధ్యమున రాణిగారికి సమీపముగానున్న పరిచారికను జూచి దేవిగారి నడిగిరి.

కౌము—ఏమని?

వకు—దేవికి దగ్గఱగా వ్రాయఁబడిన యపూర్వరాలయిన యీమె పేరేమని.

కౌము—సుందరరూపములమీఁద నాదరము కలుగుట యుక్తమే. తరువాత?

వకు—నదుత్తరమురాక యనాదరము కలుగఁగా రాజుగా రనుమానపడి దేవిగారిని గ్రుచ్చిగ్రుచ్చి యడిగిరి. అప్పుడు కొమార్తె యగు వసులక్ష్మి—"అయ్యా! ఈమె మాళవిక"—అని చప్పునఁ జెప్పివేసెను.

కౌము—(చిఱునవ్వు నవ్వి) ఇది బాల్యావస్థకుఁ దగియే యున్నది. తరువాత నేమిజరిగినదో చెప్పు.

వకు—మరియేమున్నది? ఇప్పుడు మాళవిక రాజుగారి దృష్టి పథమునఁ బడకుండ భద్రముగాఁ గాపాడఁబడుచున్నది.

కౌము—ఓసీ! ఇఁక నీకు నియమించినపనిమీఁద నీవు పొమ్ము నేనును దేవిగారి కీయుంగరమును దీసికొనిపోయెదను.

(అని నిష్క్రమించుచున్నది.)

వకు—(కొంచెమునడచి చూపునిగిడించి) ఇదిగో నాట్యాచార్యుఁడు సంగీతశాలనుండి బయలుదేఱి వచ్చుచున్నాఁడు. నేనిప్పుడీయన దర్శనము చేసికొనెదను. (అని నడుచుచున్నది.)

గణదాసుఁడు—(ప్రవేశించి) ఎల్లవారికిని కులవిద్య నిశ్చయముగా నాదరణీయముగానే యుండును. అయినను నాకు నాట్యవిద్య యందున్న గౌరవ మనర్థమయినదికాదు. ఎట్లగును?

చ. ఇది యమరాళికిన్ గనులకింపగుయజ్ఞము యంద్రు మౌను, లి
 య్యది ద్వివిధం బొనర్చె శివుఁ డర్ధసతీ సహితాత్మ దేహమం;
 దొడవు రసంబులెల్లఁ ద్రిగుణోద్భవలోకచరిత్రలం దిటన్,
 హృదిఁ దనియించు నాట్య మిల నెల్లరనున్ రుచిభేదచిత్తులన్.

వకు—అయ్యా! నమస్కారము.

గణ—సుమంగళీ! దీర్ఘాయుష్యమస్తు!

వకు—చెప్పినదానిని గ్రహించుటలో శిష్యురాలయినమాళవిక మీకు విశేషానందము కలుగఁజేయుచున్నదేమో దేవిగారు మిమ్మడిగిరమ్మన్నారు.

గణ—కళ్యాణీ! మాళవిక పరమనిపుణురాలనియు మేధావినియనియు దేవిగారికి విన్నవింపుము. వేయిమాట లేటికి?

క. ఏయది భావము తెల్పెడి
యీయభినయవిషయ మామె కే నేర్పెదనో,
యాయది విశేష మగపడఁ
జేయుచు నాకెదురు సేర్పు చెలువున నుండున్.

వకు—(తనలో) ప్రజ్ఞయం దిరావతిని మించునట్లున్నదే! (ప్రకాశముగా) గురుజను లీవిధముగా సంతోషించుచున్నారుగనుక మీశిష్యురాలిప్పుడు కృతార్థురాలు.

గణ—ఇటువంటివారు లభించుట దుష్కరముగనుక, అడుగుచున్నాను. దేవిగారీమె నెక్కడనుండి రప్పించినారు?

వకు—దేవిగారికి తక్కువవర్ణమువాఁ డయిన వీరసేనుఁడను పేరుగలతోడఁ బుట్టినవాఁ డొకఁడున్నాఁడు. రాజుగారతనిని నర్మదాతీరమునందు సరిహద్దునను న్నకోట కధికారినిగా నిలిపి యున్నారు. అతఁడీచిన్నది ధారణీదేవికి వినోదము కలిగించుట కర్హురాలుగా నుండునని యెంచి తనయప్పగారికిఁ గానుకగాఁ బంపినవాఁడు.

గణ—(తనలో) రూపవిశేషమునుబట్టి చూడఁగా నాకీమె సత్కులమునందుఁ బుట్టినదిగాఁ దోఁచుచున్నది. (ప్రకాశముగా) కళ్యాణీ! నేను నిశ్చయముగాఁ బ్రసిద్ధుఁడ నగుదును.

గీ. నీరదజలంబు పయినుండి వారిరాశి
యందు శుక్తిలోఁబడి ముత్యమైనయట్ల
యవని నుత్తమపాత్రమునందుఁ బడిన
శిక్షకునివిద్యయు గుణవిశేష మొందు.

వకు—అయ్యా! ఇప్పుడు మీశిష్యురా లెక్కడ నున్నది?

గణ—ఇప్పుడే పంచాంగిశాభినయమును నేర్పి యిఁక విశ్రాంతి పొందవలసినదని నేను జెప్పఁగా దిగుడుబావి కెదురుగానున్న గవాక్షములో మంచిగాలి ననుభవించుచుఁ గూరుచున్నది.

వకు—ఇఁక దేవరవారు నాకనుజ్ఞ యియ్యవలెను. ఇప్పుడ మీసంతోషమంతయు నివేదించి దేవిగారికుత్సాహము వృద్ధిపొందించెదను.

గణ—నీవు మీదేవి దర్శనమునకుఁబొమ్ము. కొంచెమవకాశముచేసికొని యిప్పుడు నేనును మాయింటికిఁ బోవుచున్నాను.

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు)

ఇది మిశ్రవిష్కంభము.

[అప్పుడు పరిజను లందందునిలువ, వెనుకఁజేరి లేఖ చేతఁబట్టుకొని మంత్రి సేవింప, రాజు ప్రవేశించు చున్నాఁడు.]

రాజు—(లేఖ చదువుచున్నమంత్రిని జూచి) వాహతకా! విదర్భరాజు యజ్ఞసేనుఁ డేమి తలఁచుకొన్నాఁడు?

మంత్రి—దేవా! ఆత్మవినాశము.

రాజు—ఇప్పుడు సేనాతనియుత్తర మంతయుఁ దెలియఁ గోరెదను.

మంత్రి— ఇప్పు డతఁ డీప్రత్యుత్తరము నిచ్చినవాఁడు— "మాతో సంబంధము చేయ నుద్దేశించిన మీపినతండ్రికొమారుఁ డయిన మాధవసేనుఁడు మావద్దకు రావలెనని బయలుదేఱి వచ్చుచుండఁగా దారిలో మీయెల్లపాలించు నధికారి యతనిని ముట్టడి వేసి పట్టుకొనెను. నన్ను విచారించి యాతనిని భార్యాసోదరీసహితముగా విడిచిపెట్టఁదగును" అని తమరు నాకాజ్ఞ యిచ్చుచున్నారు. ఇటువంటివిషయములో సమానవంశమునందుఁ బుట్టినరాజులలో నాచరింపఁబడు వ్యవహారము తమ కెఱుఁగనిది కాదు. కాఁబట్టియిందులోఁ దమరే మధ్యస్థులుగా నుండ నర్హులు. ఆతని తోడఁబుట్టినపడుచు ముట్టడించినప్పుడు పుట్టినసంక్షోభములోఁ దప్పిపోయినది. మనుష్యులను బంపి యామెను వెదకించెదను. మీరవశ్యముగా మాధవసేనుని నాచేత విడిపింపఁ గోరిన యెడల, విడుపుధనమును వినుఁడు.

"గీ. కార్యమంత్రి యైనట్టి మామ ఱఁదిఁ దారు
బంధముననుండి విడిపించి పంతు రేని,
వేగ మాధవసేనుని విడుచువాఁడ
నిచటఁ జెఱసాలయందుండి యేను నవల."

రాజు—(రోషముతో) ఎట్టూ! ఆతఁడు తనతర మెఱుఁగక నాతోఁ గార్యపరివర్తనమునకు బేరమాడుచున్నాఁడుగా! వాహతకా! స్వభావముచేతనే శత్రువైన యీవైదర్భుఁడు మనకుఁ బ్రతికూలుఁడుగాఁ గూడ నగపడుచున్నాఁడు. శత్రుపక్షమువాఁడుగా నున్నయీతనిని పూర్వము సంకల్పించుకొన్న ప్రకారముగా నున్మూలనము చేయుటకొఱకు వీరసేనుని వశమున నున్న సేనాచక్రమున కాజ్ఞాపింపుము.

మంత్రి—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

రాజు—మరి యీవిషయమున నీయభిప్రాయ మేమి?

మంత్రి—దేవరవారు సెలవిచ్చినది శాస్త్రదృష్టముగానున్నది. ఎట్లన—

"గీ. క్రొత్తగా రాజ్యభరముఁ గైకొన్నరిపుఁడు
ప్రజలలో వేరుదిగి దృఢపడఁడు గానఁ
జాఁతుకొనని క్రొత్తగ నాటుపాదపంబు
వలెనె యున్మూలనము చేయ సులభుఁ డగును."

రాజు—అట్లయిన రాజ్యతంత్రకారుల వచనము వ్యర్థము కాదు. ఈవచనము ప్రమాణము చేసికొని సేనాపతిని త్వరపెట్టుము.

మంత్రి—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు)

[పరిజనులు తమతమ వ్యాపారములనుబట్టి రాజుచుట్టును తగిన చోట్ల నుండఁగా విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విదూ—"గౌతమా! ఆకస్మికముగాఁ బటమునందుఁ జూడఁ దటస్థించిన మాళవికను బ్రత్యక్షముగాఁ జూడఁగాంచు నుపాయము నిప్పు డాలోచింపుము" అని మహానుభావు లయిన రాజుగారు నా కాజ్ఞాపించి యున్నారు. నే నాప్రకారముగాఁ జేసివచ్చిన సంగతి యిప్పుడే యాతనికి నివేదించెదను. (అని నడుచుచున్నాఁడు)

రాజు—(విదూషకుని జూచి) ఇదిగో! కార్యాంతరమందలి నాయుపరమంత్రి వచ్చుచున్నాఁడు!

విదూ—(దగ్గఱకుఁబోయి) మీరు వర్ధిల్లుదురుగాక!

రాజు—(తలయూఁచి) ఇక్కడఁ గూరుచుండుము.

విదూ—(కూరుచున్నాఁడు)

రాజు—నీప్రజ్ఞానేత్రమున కేదయిననుపాయము పొడకట్టినదా?

విదూ—ఇప్పుడు ప్రయోగించిన యుపాయసిద్ధి నడుగుఁడు.

రాజు—(సంతోషముతో) ఏలాగున?

విదూ—ఈలాగున (అని చెవిలో నేకాంతముగాఁ జెప్పుచున్నాఁడు.)

రాజు—మిత్రుఁడా! మేలుమేలు. నీవు బహునిపుణముగా నారంభించినావు, కార్యసిద్ధి దుర్లభమేయయినను, ఈనీకార్యారంభమునుబట్టి యిప్పుడయినట్టే సంభావించెదను. ఎట్లన—

గీ. సత్సహాయసంపన్నుఁడె సంఘటింపఁ
గలుగుఁ బ్రతిబంధములు గల్గు కార్యములను
కన్నుగలవాఁడు సహితము గానలేఁడు
వస్తువులఁ జీఁకటిని దీపబలము లేక.

తెరలోపల—చాలు. ఈపెద్దడంబపుమాటలు చాలు. రాజుగారిసమక్షముననే మనయిద్దఱిలో నెవ రధికులో యెవ రధములో స్పష్టము కాఁబోవుచున్నది.

రాజు—(ఆలకించి) మిత్రుఁడా! ఇదిగో నీనీతివృక్ష మప్పుడే పూఁతపట్టినట్టున్నదే!

విదూ—త్వరలోనే నీవు దానిఫలమునుం జూడఁగలవు.

[అప్పుడు కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా! ప్రభువుగారి యాజ్ఞ జరిగించినాఁడ నని మంత్రి విజ్ఞాపనము చేయుచున్నాఁడు. అంతేకాక యుభయాచార్యులైన హారదత్తగణదాసు లిరువురును బరస్పర జయకాంక్షతోఁ దమదర్శనము నపేక్షించి రూపమును ధరించిన సాక్షాత్కోపదేవతలవలె నున్నారు.

రాజు—వారిని లోపలికి రమ్మను.

కంచు—దేవర సెలవిచ్చినట్లు చేసెదను. (అని నిష్క్రమించి వారితో మరలఁ బ్రవేశించుచున్నాఁడు.)

కంచు—ఆచార్యులారా! ఇటు. ఇటు.

గణ—(రాజును జూచి) ఓహో! రాజమహిమ దురాసదము గదా!

గీ. అపరిచితుఁడుగాఁ డితఁ డుగ్రుఁ డయినఁ గాఁడు;
భయపడెద నట్టులయ్యుఁ బార్శ్వంబుచేర
జలధివలె నీనృపుఁడు ప్రతిక్షణము నాదు
కన్నులకుఁ గ్రొత్తక్రొత్తగఁ గానిపించు.

హర—పురుషాకారమున నున్న యీ జ్యోతి మహత్తరమయినదిగదా!

ఉ. ద్వారమున న్నియుక్తపరివారము సమ్మతిమీఁదఁ జొచ్చి, ధా
త్రీరమణాంతికానుచరుఁ క్రేవనె చెంతకుఁ బోవుచుండియున్
మేరకుమీఱి దృష్టి మిఱుమిట్లిటు గొల్పెడి రాజుతేజముఁ
జేరి మరల్పఁగాఁబడిన చెల్వు వహించితి మాట లేటికిన్.

కంచు—ఇదె ప్రభువారు, మీరు సన్నిధానమునకుఁ బొండు.

ఉభయులు—(దగ్గఱకుఁ బోయి) దేవా! విజయోస్తు!

రాజు—మీకు స్వాగతము. (పరిజనులను జూచి) వీరికిఁ బీఠములను బెట్టుఁడు.

[ఇద్దఱును పరిజనులు తెచ్చిన పీఠములమీఁద గూరుచున్నారు.]

రాజు—ఇదియేమి! శిష్యురాండ్రకు విద్యోపదేశము చేయవలసినకాలమునం దాచార్యులిరువురు నొక్కసారిగా నిక్కడకు విజయముచేసినారు?

గణ—దేవా! చిత్తగింపుము. నేను సద్గురుముఖమున నభినయవిద్యను జక్కఁగా నభ్యసించినాఁడను. దేవరవారు నాకు నాట్య

భినయాధికారమును దయచేసినారు. దేవిగారును నన్నాదరించు చున్నారు.

రాజు—ఇది మాకుఁ దెలియును. అవ్వల నేమి?

గణ—అట్టి నన్నీహరదత్తుఁడు పెద్దమనుష్యులయెదుట "నీవు నా కాలిధూళితోనైనను సమానుఁడవుగావు" అనియాక్షేపించినాఁడు.

హర—దేవా! "నాకును నీకును సముద్రమునకును బిల్లకాలువకునుగల తారతమ్యమున్నది" అని యితఁడే నన్ను మొట్టమొదట దూషించినవాఁడు. కాఁబట్టి యిక్కడఁ దమరే యీయనను నన్నును శాస్త్రమునందును బ్రయోగమునందును బరీక్ష చేయుఁడు. దేవరవారే మాయుభయవిశేషజ్ఞ వివాదమును నిర్ణయింపఁ దగినవారు.

విదూ—ఈప్రతిజ్ఞ చక్కఁగా నున్నది.

గణ—ఈసంకల్ప ముత్తమ మైనది. దేవరవారు సావధానముగా వినవలయును.

రాజు—కొంచెము తాళుఁడు. ఇక్కడఁ బక్షపాతము జరిగినట్లు దేవి యెంచుకొనును. కాఁబట్టి పండితకౌశికీసహితురా లయిన యామెసమక్షమునందే యీ వ్యవహారము తీర్పవలెను.

విదూ—దేవరవారు సెలవిచ్చినది దివ్యముగానున్నది.

ఆచార్యులు—దేవరవారిచ్చవచ్చినట్లు చేయువచ్చును.

రాజు—(కంచుకిని జూచి) మౌద్గల్యా! ఈప్రస్తావనని వేదించి పండితకౌశికీ సహితముగా దేవిగారిని బిలుచుకొని రమ్ము.

కంచు—దేవరవారియాజ్ఞ చొప్పునఁ జేసెదను.

[అని నిష్క్రమించి సపరివ్రాజికయైన దేవితో మరల
ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—అమ్మా! ఇటు, ఇటు.

ధార—(పరివ్రాజికనుజూచి) అమ్మా! ఈహరదత్తగణదాసుల కలహవిషయమున మీకేమి తోఁచుచున్నది?

పరివ్రా—నీపక్షమున కపజయము కలుగునని శంకింపకుము. గణదాసుఁడు ప్రతివాదికిఁ దీసిపోవువాఁడు కాఁడు.

ధార—అది యట్టిదే యయినను, రాజు చేకొనినవాఁడగుట చేత హరదత్తున కాధిక్యము హెచ్చును.

పరివ్రా—అమ్మా! నీవును రాజ్ఞీశబ్దమున కర్హురాల వై యున్నమాట చిత్తమం దుంచుకొమ్ము.

గీ. భాస్కరపరిగ్రహతఁ జేసి పావకుండు
తాను మహనీయభాసురత్వంబు గన్న,
వలనిశాపరిగ్రహణమువలన శశియు
మహిమఁ గాంచఁడె యెల్లెడ మహిని దాను?

విదూ—చూడు! చూడు! సహచారిణియైన పండితకౌశికిని ముందుంచుకొని ధారణీదేవి వచ్చుచున్నది.

రాజు—ఆమెను జూచుచున్నాఁడను.

క. యతివేషయైనకౌశికి
యతులగతిం జేయ మంగళాలంకృతఁగా,
సతి యాధ్యాత్మికవిద్యా
యుతయైన త్రయీస్వరూపయో యన నలరున్.

పరి—(దగ్గఱకువచ్చి) దేవా! విజయోస్తు!

రాజు—అమ్మా! నమస్కారము.

పరి—గీ. వరమహాసారసుప్రసవత్వ మొంది
లలి సమానతమను యలరునట్టి
ధారణీభూతసంతానధారిణులకు
వత్సరశతంబు భర్తవై వఱలు మీవు.

ధార—ప్రాణేశ్వరా! మీకు శుభమగుఁగాక!

రాజు—దేవికి స్వాగతము. (పరివ్రాజికనుజూచి) అమ్మా! పీఠమును స్వీకరింపుము.

(అందఱును గూరుచున్నారు)

రాజు—అమ్మా! పరస్పరవిజ్ఞానవిషయమున ఘర్షణపడుచున్న యీహరదత్తగణదాసులను మీరిప్పుడు పరీక్షచేయవలెను.

పరి—(చిఱునవ్వు నవ్వి) ఈపరిహాసము చాలును. పట్టణమొద్దనుండఁగా, పల్లెయందా రత్నపరీక్ష?

రాజు—అట్లుకాదు. నీవు పండితకౌశికివిగదా? నేనును దేవియుఁగూడ నిందుఁ బక్షపాతులము.

ఆచార్యులు—దేవరవారు సెలవిచ్చినది బాగుగ నున్నది. మధ్యస్థురాలయిన యీమెయే మాగుణదోష నిర్ణయమును చేయుట కర్హురాలు.

రాజు—అందుచేతనే యీవివాద మీమెయే విమర్శింప నారంభింపవలెను.

పరి—దేవా! నాట్యశాస్త్రమునం దాటప్రధానము. కేవల వాగ్వ్యవహారముచేత నేమిప్రయోజనము? ఇందు దేవిగారియభిప్రాయమేమో!

ధార—నాయభిప్రాయ మడిగితిరా, మొదలవీరిద్దఱివివాదమే నాకు రుచింపకున్నది.

గణ— దేవీ! విద్యయందు సమానుఁడని నాకవమానము వచ్చునట్లు చేయుట నీకు ధర్మముకాదు. నన్ననుగ్రహింపవలెను.

విదూ—అమ్మా! ఈ కుక్షింభరుల సంవాదమును విందము. వీరికి జీతము లిచ్చి వృథాగాఁ గూరుచుండఁబెట్టనేల?

ధార—నీవు కలహప్రియుఁడవుగా నున్నావే.

విదూ—అమ్మా! అట్లుకాదు, రెండు మదపుటేనుఁగు లన్యోన్య కలహప్రియము లయినప్పుడు వానిలో నేదో యొకటి పరాజయము పొందక శాంతి యెట్లుకలుగును?

రాజు—అమ్మా! మీ రుభయులయొక్క నాట్యకౌశలము నీవఱకే చూచియున్నవారుకదా?

పరి—అవును. చూచినదానను.

రాజు—అట్లయిన వీరిప్పుడంతకంటె నధికముగాఁ దెలుపఁగలదేమున్నది?

పరి—నేను నదే చెప్పఁదలంచి యున్నాను.

ఉ. కొందఱు విద్య నన్యులకుఁ గోవిదులయ్యును నేర్పలే రిలన్;
గొందఱు బోధసేయుదురు గొప్పగఁగొంచెమె తాము నేర్చియున్
బొందుగ రెండిటం దెలివిఁ బొంది వెలింగెడుబుద్ధిశాలులే
యెందును నగ్రగణ్యుఁ లని యెన్నికఁగాంతురు శిక్షకాళిలోన్.

విదూ—పూజ్యురాలయిన యీమెవాక్యము విన్నారుకదా? దాని పండితార్థమిది—వీరు నేర్పినది చూచుటవలననిర్ణయింపవలెనని,

హర—నాకిది పరమసమ్మతము.

గణ—దేవా! అలాగున జరిగింపవలెను.

దేవి—మందమతియైన శిష్యురా లుపదేశించినది తిన్నగా గ్రహింపనియెడల, అదియు గురువుదోషమేనా?

రాజు—దేవీ! అవునది యట్టిదే. చెప్పినది తెలిసికొలేనిదానిని స్వీకరించుటలోఁగూడ బుద్ధివైభవము వెల్లడియగును.

దేవి—(తనలో) ఇప్పుడేమిచేయుదును? (గణదాసునిజూచి ప్రకాశముగా) నాప్రాణేశ్వరుని కుత్సాహకరమైన యీమనోరథ పరిపూర్తి యింతటితోఁ జాలును. ఇఁక నిరర్థక ప్రయత్నమును మానుఁడు.

విదూ—దేవిగారు సెలవిచ్చినది బాగున్నది. ఓగణదాసా! సంగీతాచార్యత్వము పొంది సరస్వతికి నైవేద్యము పెట్టు మోదకము లను భక్షించుచుఁ గూరుచుండెడు నీకీపరాభవకరమయిన శుష్క కలహముతో నేమి ప్రయోజనమయ్యా?

గణ—సత్యముగా దేవిగారివాక్యమున కదేయర్థము. సమ యోచితమయిన యీవాక్యమును వినుఁడు—

గీ. పడసితిని గొల్వు నేనని వాదమునకు
జడిసి యొరుదూషణము నోర్చి చదువు నొక్క-
జీవనోపాయముగనె తాఁ జేసికొనెడు
వాఁడు జ్ఞానవిక్రయుఁ డగువణిజుఁ డగును.

దేవి—శిష్యురాలు మీవద్ద విద్యనారంభించియెంతో కాలము కాలేదు. తిన్నఁగా మనసునఁ బట్టనివిద్య పరీక్షయిచ్చుట యనర్థ దాయకము.

గణ—ఎంతో కాలము కాలేదు గనుకనే నేను నింత నిర్బంధ పఱుచుచున్నాను.

దేవి—అట్లయిన నిరువురును మీయుబదేశమును బూజ్యురా లైన యీమెకే కనఁబఱుపుఁడు.

పరి—దేవీ! అది న్యాయముకాదు. సర్వజ్ఞునకైనను నొంటరిగా నుండి న్యాయము తీర్చుట యుక్తముకాదు.

దేవి—(జనాంతికముగా) ఓ తెలియనిదానా! పరివ్రాజికా! మేలుకొని యున్నను నన్నునిద్రపోవుచున్నదానివలెఁ జేయుచున్నావు!

(అని యసూయతో రాజునుండి మొగము త్రిప్పుకొనుచున్నది)

రాజు—(దేవిని బరివ్రాజికకుఁ జూపుచున్నాఁడు)

పరి—గీ. చంద్రవదనరో! నీవు నిష్కారణముగ
విముఖ వయ్యెద వేటికి విభునినుండి?
పతుల పయి నెంతప్రభుతను బడసి యున్న
హేతువున్ననె కోపింతు రిలను సతులు.

విదూ—అమ్మా! హేతు వున్నది. స్వపక్షమువారిని రక్షింపవలయును. (గణదాసునివంకఁ జూచి) ఓయీ! అదృష్టశాలివి గనుక దేవిగారికోపవ్యాజముచేత నీవిప్పుడు బ్రతికిపోయినావు. తామెంత మంచిశిక్ష పొందినవారయినను దమవిద్యఁ జూపవలసివచ్చినప్పు డందఱును జంకుపడుదురు.

గణ—దేవీ! వినుము. ఈ విధముగా నితఁ డెంచుకొనుచున్నాఁడు. అందుచేత నిప్పుడు—

గీ. నేను జెప్పినవిద్యను గానిపింపఁ
దలఁచి యున్నాఁడ నీవివాదంబునందు,
నందు కీవనుమతి యియ్యకుందువేని.
విడువఁబడినాఁడ నీచేత వెలఁది నేఁడు.

(అని పీఠమునుండి లేవఁబోవుచున్నాఁడు)

దేవి—(తనలో) ఇఁక నేమిగతి? (ప్రకాశముగా) గురువులే శిష్యజనులయెడ సర్వాధికారులు.

గణ—దీర్ఘాయుష్మంతురాలవుగమ్మ. ఇది వ్యాజ మన్నశంక యింతటితోఁ జాలును. (రాజును జూచి) దేవిగారనుజ్ఞయిచ్చినారు. కాఁబట్టి యేయభినయరూపమునందు విద్య, కనఁబఱుపవలయునో దేవర యాజ్ఞాపించవలెను.

రాజు—ఈమె సెలవిచ్చినదానియందు.

పరి—దేవిగారిమనసులో నేమో యున్నది. అందుచేత నేను శంకించు చున్నాను.

దేవి—శంకవదలి పలుకవచ్చును. నాపరిజనముమీఁదను ప్రభువుగారి కధికార మున్నది.

రాజు—నాకని చెప్పు.

దేవి—అమ్మా! ఇప్పుడు చెప్పు.

పరి—దేవా! శర్మిష్ఠచేత రచియింపఁబడి పాదచతుష్టయ సహిత మయినచలిక మను నాటక మభినయించుట కష్టమని చెప్పుచున్నారు. ఆయొక్కదానినె యుద్దతిచేతను పట్టించి మాతము. దానివలననే వీరి యుపదేశతారతమ్యమును దెలిసికో వచ్చును.

ఆచార్యులు—అమ్మగా రాజ్ఞాపించునట్లు చేయుఁదు.

విదూ—అట్లయిన మీరిరువురును నాటకశాలయందు సంగీత రచనచేసిరాజుగారియొద్దకు దూత నంపుఁడు. అట్లుకానియెడల మద్దెల చప్పుడే మమ్ము లేవఁదీసికొని వచ్చును.

హర—అలాగే. (అని లేచుచున్నాఁడు.)

గణ—(ఘారణివంకఁ జూచు చున్నాఁడు.)

దేవి—(గణదాసునిజూచి) అయ్యా! మీకు విజయము కలుగునుగాక! నేనెప్పుడును మీకు మేలు కోరుదాననే సుమా!

(ఆచార్యులు లేచుచున్నారు.)

పరి—కొంచెమిటు రండు.

ఆచా—(దగ్గఱకుఁబోయి) ఇదిగో వచ్చినారము.

పరి—తారతమ్యనిర్ణయాధికారము పొందితిని గనుకఁ జెప్పుచున్నాను. అన్నియవయవములసౌష్ఠవమును చక్కఁగాఁ గనఁబడుటకై యలంకారము విశేషముగాఁ జేయుక పాత్రలను దీసికొని రండు.

ఇద్దఱు—ఈసంగతి తమరు మాకు బోధింప నక్కఱలేదు.

(అని నిష్క్రమించుచున్నారు.)

దేవి—(రాజునుజూచి) ఇటువంటినేర్పు తమరు రాజకార్యములయందుఁ బ్రయోగించినయెడల, ఎంతో మేలు గలుగును.

రాజు—న న్నన్యథా భావింపకుము. ఓ మనోనాయికా! ఇది నేను పన్నినది కాదుగదా ? సమానవిద్యగలవారు కీర్తికొఱకొకరినొకరు తప్పులు పట్టుకొనుట సాధారణమే.

[నేపథ్యమునందు మృదంగధ్వని వినఁబడఁగా నందఱు నాలకించుచున్నారు.]

పరి—ఆహా! సంగీతమారంభ మయినది.

గీ. మేఘగర్జనశంకచే మెడలనెత్తి
మద్దెలరవంబుతోడ నెమళ్లుకూయ
మధురముగ బర్హిణాంగనల్ మలసిచేయు
మధ్యమస్వర మలరించె మనుల నిపుడు.

రాజు—దేవీ! మనమక్కడ సభికులమగుదము రమ్ము.

దేవి—(తనలో) ఆహా! ఏమిప్రాణనాయకుని యవినయము!

(అందఱును లేచుచున్నారు.)

విదూ—(రహస్యముగా) ఓయీ! ధీరత్వముతో నడువుము. ధారణీదేవి మఱియొకవిధముగా భావించుకొనును.

రాజు—గీ. ధైర్యము వహించియున్నను దగఁగ నన్నుఁ
గర్వముఁ ద్వారపెట్టుచున్న దీమురజరవము
సిద్ధిపథమున నడచుచుఁ జెలఁగుపట్టి
స్వసుమనోరథశబ్దంబు చందమునను.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

ద్వితీయాంకము

రంగము—సంగీతశాల

[అప్పుడు పీఠముమీఁదఁ గూరుచుండి మిత్రునితోఁగూడ రాజును, ధారణియు, పరివ్రాజికయు, అర్హా పరివారమును ప్రవేశించుచున్నారు]

రాజు—అమ్మా! పూజ్యు లయిన యాచార్యు లిరువురిలో నెవ్వరి యుపదేశనైపుణ్యమును ముందుగాఁ జూతము?

పరి—పాండిత్యప్రభావముచేత నిద్దఱును సమానులే యయినను, వయోవృద్ధగుటవలన గణదాసుని నేముందుగా గౌరవింపఁదగును.

రాజు—అట్లయిన, మౌద్గల్యా! ఆపూజ్యుల కీసంగతి తెలిపి, నీవు నీ పనిమీఁదఁ బొమ్ము.

కంచు—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని పోవుచున్నాఁడు)

గణ—(ప్రవేశించి) దేవా! మధ్యలయముగలిగి శర్మిష్ఠచేత జేయఁబడిన చలికనాటకములో నాలుగుపాదములు గల కృతియొకటి కలదు. దేవరవారు దాని ప్రయోగ మేకాగ్రచిత్తతతోఁ జిత్తగింపఁదగును.

రాజు—ఆచార్యా! మేము మిక్కిలి యుపహితుల మయి యున్నాము. పాత్రములను దీసికొని రమ్ము.

(గణదాసుడు నిష్క్రమించుచున్నాఁడు)

రాజు—(జనాంతికముగా) మిత్రుఁడా!

గీ. అల యలంకారమందిరమందు నున్న
కన్నె దర్శింపఁగోరి నాకన్నుదోయి
క్షణముఁ గాలవిలంబము సైఁపలేక
తెరనుదీయంగ నుంకించుకరణి నుండె.

విదూ—(రహస్యముగా) నీయభీప్సితమూర్తి విశేషము దృష్టిపథమునఁ బడఁబోవుచున్నది. కనుక నీవిప్పు డప్రమత్తుఁడ వయి చూడుము.

[అప్పుడు తన యంగసౌష్ఠవమును జూచుచున్న యాచార్యునితో మాళవిక ప్రవేశించుచున్నది]

విదూ—దేవా! చూడుము. పరాధీనురా లయి యున్నను, ఆమె సౌందర్యమునకుఁ గొఱఁత యేమియు లేక యున్నదిగదా?

రాజు—(రహస్యముగా) మిత్రుఁడా!

గీ. చిత్రపటమున నాఁడు వీక్షించినప్పు
డట్టి సొగసుండదని సంశయంబు వొడమె
నేఁడు ప్రత్యక్షముగ నీమెఁ జూడ నిందు
శిల్పి యప్రౌఢుఁడంచుఁ దోఁచెడిని మదికి.

గణ—బిడ్డా! భయము విడిచి స్వస్థచిత్తురాలవు కమ్ము.

రాజు—(తనలో) ఓహో! ఈరూపము సర్వావస్థలయందును నిర్దోషముగా నున్నది!

సీ. నిడువాలుఁగన్నులఁ గడునొప్పి వదనంబు
శరదిందు కాంతిని జానుమీఱు
అంసభాగంబుల నందంబుగా వంగి
బాహువు లెంతయు బాగుమీఱు
ఘనమైననిక్కఁ జన్గవచేత వక్షంబు
పార్శ్వమం దడఁగినభాతి మీఱు
మధ్యప్రదేశంబు మానుగఁ బిడికిటఁ
బట్టంగఁదగియుండి వన్నెమీఱు
జఘన మెంతయు నమితమై పాటిమీఱు
వంపులై యొప్పు నంగుళు ల్పాదములను
హృదయమున నర్తనాచార్యుఁ డెట్టులుండ
నభిలషించునో యట్లుండె నంగగరిమ.

మాళ—(ఉపగానముచేసి, చతుష్పాదగీతమును బాడుచున్నది)

* చ. హృదయమ! దుర్లభుండు ప్రియుఁ డీయనపై నిఁక నాశమానుమీ;
యదరెడు వామనేత్ర మహహా యిపుడేమొకో నాకువింతగా;
నొదవెడు నెట్లు క్రమ్మఱనయో చిరదర్శితు నీయనం గనన్!
సదయతఁ బ్రేమచేఁ బరవశాత్మగ నన్ను నెఱుంగు నాయకా!
(అని రసోచితముగా నభినయించుచున్నది)

(మాళవిక జంకి నిలుచున్నది)

---

* ఘంటారాగము—ఆదితాళము.

పల్లవి—ఏలవలచితి వయ్యయో! యేలాగుదరియింతు నయ్యయ్యో!
అనుపల్లవి—ఈలాగౌట తెలియనైతి* నిలువయి వెతలపాలయితి.
౧. మనస! నీవు కోరునట్టి* మనుజుఁ డెంతో దుర్లభుఁడు సుమ్మీ.
కనుక, నీవు నామీఁది* కట్టాస మానుము నేఁడు... ఏలవలచితి,

విదూ—(రహస్యముగా) ఓహో! మిత్రుఁడా! ఈమె యీ నాలవపాదార్థము నభినయించుమిష పెట్టి తన్ను నీకర్పించుకొనుచున్నట్టుగా నున్నది!

రాజు—సఖుఁడా! మాయిరువుర హృదయములు నట్లేయున్నవి.

చ. అయమ ‘ప్రేమచే వివశురాలనుగా నిదె నన్నెఱుంగు మో
నాయక’ యన్నవాక్యమును నాకడ సాభినయంబుగాఁగఁ దా
నీయెడఁ బాడుచో సరస నీవల ధారణియుంట నొక్కలేఁ
బ్రాయము వేఁడుమిషఁ బ్రార్థనచేసెను నన్ను కూరిమిన్.

[మాళవిక గీతము పాడినతరువాత వెనుకకుఁ బోఁబోవుచున్నది]

విదూ—అమ్మా! పోకనిలువుము. నీవాటయం దొకక్రమము మఱచిపోతివి. నేను దానినిప్పుడే నీకుఁ దెలిపెదను.

గణ—బిడ్డా! నే నుపదేశించిన విద్యయందు లోపముండదని కనఁబఱుతువుగాని క్షణమాత్రము నిలువుము.

రాజు—(తనలో) ఆహా! ఈమె రూపము సర్వావస్థలయందును వింతసోయగమును నింపుచున్నది. ఎట్లన,

మ. వలయంబుల్ మణిబంధమంటఁ గటినొప్పింజేర్చి డాకేలు, ని
శ్చలతన్ రెండవకేలు వాల్చి దిగువన్ శ్యామాలతంబోలఁగా,

---

౨. ఎడమకన్ను దేమొకాని* యిప్పుడెంతో తనయంత,
వడిగ నదరఁజొచ్చె నిదిగో* బాగయ్యె మేమే హాహా...ఏలవలచితి.
౩. ఇన్నినాళ్లకిందు నాకు* నిటులు లభించిన నరనాథుఁ
గన్నులారఁజూడనైతి* క్రమ్మఱంగాఁ గలుగునే?...ఏలవలచితి.
౪. అవుర నీవెఱింగికొమ్మి* యల నీపయి ప్రేమచే
వివశురాలనంచు నన్ను* వేవేగ సదయ పూని...ఏలవలచితి.

పలకుస్మీటుచు నేలచూపులను బాదాంగుష్ఠమాత్రంబునన్
నిలుచున్నప్పుడె నృత్యకాలమునకంటెం జెల్వ చెల్వొందెడున్.

దేవి—ఈయాచార్యులు గౌతముని మాటను సహితము పాటిగాఁ బట్టుచున్నారుగదా?

గణ—దేవీ! అట్లనఁగూడదు. రాజవిశ్వాసమువలన గౌతమునికి సూక్ష్మదర్శిత్వము కలుగుచున్నది. చూడుము—

గీ. చిల్లగింజలపొడితోడఁ జేరుకతనఁ
కల్మషజలంబు స్వచ్ఛతఁ గాంచునట్లు
పండితులతోడి సహవాసబలముచేత
మందుఁడైనను గడు బుద్ధిమంతుఁ డగుచు.

(విదూషకునిజూచి) మీ యభిప్రాయమును వినఁగోరుచున్నాము.

విదూ—(గణదాసునిజూచి) ముందుగాఁ బండితకౌశికి నడుగుఁడు. నేను గనిపెట్టిన క్రమభంగమును దరువాతఁ జెప్పెదను.

గణ—అమ్మా! గుణమునుగాని దోషమునుగాని నీవుకనిపెట్టినది సెలవిమ్ము.

పరి—నేను జూచినంతవఱకు సర్వమును నిర్దుష్టముగానున్నది. ఎందుచేతనన—

చ. పలుకులయర్థ మంగముల బాగుగఁ గన్పఱుపంబడెన్; రసం
బుల లయతోడ నైక్యమునుబొందెఁ బదంబులుపెట్టురీతి; యిం
పలరెను గొంచెమై మృదుకరాభినయంబు వరానువృత్తులన్;
వెలసె మనోహరంబగుచు వింతగ భాగము రాగబద్ధమై.

గణ—దేవరవా రెట్లుభావించుచున్నారు?

రాజు—మాకు స్వపక్షమువారియెడఁ గలయభిమానము తగ్గిపోయినది.

గణ—నే నిప్పుడు నర్తనాచార్యుఁడ నయినాను.

గీ. జగతి నిష్పక్షపాతులౌ సాధుజనులె
శిక్షకునివిద్యశుద్ధత చెప్పఁగలరు;
వహ్నియందును బంగారువలెనె మీరు
సన్నిధిని వన్నెకెక్కె మాచదువుకూడ.

దేవి—అయ్యా! మీరదృష్టవంతులు. ఈపరీక్షకులచేత మెప్పు పొందినారు.

గణ—దేవీ! మీయనుగ్రహమే నావృద్ధికి హేతువు. (విదూషకునిఁ జూచి) గౌతమా! నీమనస్సులో నున్నదేమో యిప్పుడు చెప్పుము.

విదూ—ప్రథమోపదేశ దర్శనసమయము నందు ముందుగా బ్రాహ్మణపూజ చేయవలెను. మీ రాపూజను మఱచిపోయినారు.

పరి—ఓహో! ఇది ప్రయోగములోపలిప్రశ్నగదా! (అందఱును నవ్వుచున్నారు. మాళవికయుఁ చిఱునవ్వు నవ్వుచున్నది.)

రాజు—(తనలో) కన్నులు గలిగినందునకుఁ జూడవలసినసారమును జూడఁగాంచితిని! ఎట్లన—

గీ. పల్వరుస యింత కానంగఁబడఁగ మంద
హాస మొనరించు నీవిశాలాక్షి మోము
కేసరంబు లొక్కింత లక్షింప నయిన
కమలమునుబోలి యుందమై కానిపించు.

గణ—ఓదొడ్డబ్రాహ్మణుఁడా! ఇదిపరీక్ష కాని యాటకాదుగదా? ఆటయే యయినపక్షమున, బూజార్హుఁడ వయిననిన్నుఁ బూజింపకుందుమా?

విదూ—నేను నిశ్చయముగా నీరు త్రాగవలె నన్నయాశతో

వట్టియుఱుములు గలయాకాశమును గనిపెట్టుకొని యున్నచాతకపక్షి నయినాను.

పరి—ఆలాగుననే యయినావు.

విదూ—అట్లయినఁ బండితుల సంతోషమువలన లాభము పొందవలెనని నమ్మియున్న నావంటివారు కేవల మూఢులు. పూజ్యురాలయినయీపరివ్రాజిక మెచ్చినది గనుక నేనీయునకు బహుమాన మిచ్చెదను. (అని రాజుచేతినుండి బంగారుమురుగును దీయుచున్నాఁడు.)

దేవి—నిలువుము. రెండవవారి గుణ తారతమ్యముకూడఁ దెలియకమునుపే నీ వీయాభరణ మేల యిచ్చెదవు?

విదూ—ఇది మఱియొకరిసొత్తు గనుక.

దేవి—(ఆచార్యునివంకఁ జూచి) అయ్యా! గుణదాసా! మీ శిష్యురాలు విద్య కనఁబఱుచుట యయినదిగదా?

గణ—బిడ్డా! మన మింక వెళ్ళుదమురా. (ఆచార్యునితోఁ గూడ మాళవిక పోవుచున్నది.)

విదూ—(రహస్యముగా) దేవర సేవచేయుటలో నాబుద్ధి వైభవ మింతే.

రాజు—'ఇంతే' యన్నమాట చాలింపు.

గీ. ఆమె తెరచాటునను మఱుం గగుట నాదు
కనులకును భాగ్య మస్తమించినవిధంబు
హృదయమున కుత్సవసమాప్తి యొదవినట్లు
హర్షమునకు ద్వారము మూసినట్లుఁ దోఁచు.

విదూ—(రహస్యముగా) మేలు! దరిద్రాతురునివలె వైద్యుని నే యౌషధము చేసి పెట్టు మనుచున్నావు!

[హరదత్తుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

హర—దేవా! ఇప్పుడు నాయొక్కవిద్యోపదేశమును జిత్తగించుట కనుగ్రహింపుఁడు.

రాజా—(తనలో) నేను జూడఁగోరినది సమాప్త మయినది. (దాక్షిణ్యము కనఁబఱుచుచుఁ బ్రకాశముగా) మేము చూడ వేడుక గలవార మయియే యున్నాము.

హర—నేను ధన్యుఁడ నయినాను.

[తెరలో వైతాళికుఁడు.]

దేవా! జయ మగుఁగాక! జయ మగుఁగాక! మధ్యాహ్న మగు చున్నది. అందుచేత నే—

ఉ. అంచలు కన్నుమూసెడును నంబుజపత్రమునీడ డిగ్గియున్,
మించిన వేఁడిఁ, జేర నవెమేడల చూరులు పావురంబులున్,
కాంచి నెమళ్లుపోయెడు దగన్ జలయంత్రము చేర నీటికై,
మించెఁ బ్రతాపపూర్ణుఁడయి మీవలెనే రవియు న్నృపాలకా.

విదూ—అయ్యో! అయ్యో! మాకు భోజన వేళ యయినది. వేళ తప్పినయెడలఁ బ్రభువువారికి జబ్బుచేయునని వైద్యులు చెప్పు చున్నారు. హరదత్తా! నీ వేమి చెప్పెదవు?

హర—ఇప్పుడు నాకేమి చెప్పుటకును నవకాశము లేదు.

రాజా—(హరదత్తునివంకఁ జూచి) అట్లయిన మీయుపదేశ మును రేపు చూపవచ్చును. ఇప్పటికిఁ జాలింపుఁడు.

హర—దేవరవా రాజ్ఞ యిచ్చినట్లు చేసెదను.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

దేవి—దేవరవారు మాధ్యాహ్నికకృత్యములనుదీర్పవలెను.

విదూ—దేవీ! అన్నపానములు నేఁడు త్వరపెట్టివిశేషముగా జేయింపుము.

పరి—(లేచి) మీకు శుభ మగుఁగాక! (అని దేవితోఁగూడ పోవుచున్నది.)

విదూ—ఓహో! కేవల రూపమునందేకాక నాట్యమునందుఁ గూడ మాళవిక యసమానురాలుగా నున్నదే!

రాజు—మిత్రుఁడా!

గీ. విద్యచేతనె సౌందర్యవిభవమునను
ధాత యిట్టియవ్యాజసుందరిని జేసి
విషముపూసినబాణంబు వేఱొకండు
పంచబాణున కిపుడు కల్పించెఁ దాను.

పలుపలుకు లేల? నేను నీవారయవలసినవాఁడ నయినాను.

విదూ—నేనును నీ కారయవలసినవాఁడ నయినాను. అంగడిలోని మంగలము వలె నిశ్చయముగా నాకడుపు మండుకొని పోవుచున్నది.

రాజు—అందుకు సందేహములేదు. నీవు మిత్రకార్యమునందుఁ ద్వరపడవలెను.

విదూ—నేను గృతనిశ్చయుఁడ నయినాను. కాని, మేఘములచాటున నున్న వెన్నెలవలెనే పరాధీనురాలయిన మాళవిక దర్శనమే శీఘ్రసాధ్యము కాదు. నీవో కటికివానిసమీపమున నున్న మాంసమునందత్యాశ గలిగి చేర భయపడుచున్న గృధ్రము వలె నున్నావు. అత్యాతురునివలెఁ గార్యసిద్ధిని వేఁడుచున్న నిన్నుఁ జూడఁగా నాకు వేదు కగుచున్నది.

రాజు—నే నాతురుఁడను గాక యెట్లుండ గలను?